RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



22 ఏప్రిల్ 2025 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:276

## తెలంగాణ – జపాన్ మధ్య ఉన్న చారిత్రక స్నేహ బంధాన్ని దీర్ఘకాలిక భాగస్వామ్యంగా తీర్చిదిద్దుకుందాం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణలో మరొక మైలురాయిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్‌లో జరిగిన వరల్డ్ ఎక్స్‌పో 2025 వేదికగా రాష్ట్ర పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన ప్రతిష్ఠాత్మక ఎక్స్‌పో 2025లో ముఖ్యమంత్రి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం భాగస్వామిగా పాల్గొంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వారితో సుదీర్ఘంగా చర్చించారు.

ఈ వేదికగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వరల్డ్ ఎక్స్‌పో 2025లో భారతదేశం నుంచి మొట్టమొదటిగా పాల్గొన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఇది గర్వకారణమని తెలిపారు. తెలంగాణ – జపాన్ మధ్య ఉన్న చారిత్రక స్నేహ బంధాన్ని దీర్ఘకాలిక భాగస్వామ్యంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్తు ప్రణాళికలను రూపుదిద్దుకునే దిశగా కలిసి పనిచేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

సులభతర పారిశ్రామిక విధానం, స్థిరమైన పాలన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణకు పెట్టుబడులకు ఆకర్షణగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "హైదరాబాద్‌కు రండి, మీ ఉత్పత్తులు ఇక్కడ తయారు చేయండి. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచ దేశాలకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి" అంటూ జపాన్ కంపెనీలను ఆహ్వానించారు.

తెలంగాణ – జపాన్ మధ్య ఉన్న మంచి సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త



అధ్యాయానికి ఇది నాంది కావచ్చని అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఒసాకా, అంతర్జాతీయంగా మిగతా భాగస్వాములతో కలసి అద్భుత భవిష్యత్తును నిర్మిద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లో 30,000 ఎకరాల విస్తీర్ణంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. ఇది ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీ కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇందులో భాగంగా జపాన్‌కు చెందిన మరుబెని కార్పొరేషన్‌తో కలిసి ఒక ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల పొడవైన రీజనల్ రింగ్ రోడ్ , రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్ మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. అంతర్జాతీయ ఎగుమతుల కోసం సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

మూసీ నది పునరుజ్జీవంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధికి జపాన్ నగరాలైన టోక్యో, ఒసాకాల శ్రేష్ఠమైన అనుభవాల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ ఇప్పటికే ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందని గుర్తుచేస్తూ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో పెట్టుబడులకు అనువైన వాతావరణం రాష్ట్రంలో నెలకొన్నదని వివరించారు.పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ, నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ'ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇది ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి

### నిజామాబాద్ రైతు మహోత్సవ సదస్సులో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ప్రజల ఆశలు, ఆకాంక్షల అనుగుణంగా కాంగ్రెస్ పాలన ప్రభుత్వంపై ప్రతిపక్షాలు వాస్తవాలు ప్రచారం చేస్తున్న చిత్త చిత్తశుద్ధితో ప్రజల అభీష్టం మేరకు పాలన సాగుతోంది

బిఆర్ఎస్ నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్టు వలన లక్షన్నర కోట్లు గోదావరి నదిలో పోసిన పాపం కేసిఆర్ ది

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు పూర్వవైభం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి ది, మంత్రులది

రాజకీయానికి, సామరస్యానికి మారుపేరు నిజామాబాద్

ఎన్నికల వరకే పార్టీలు.. ఎన్నికల తర్వాత జిల్లా అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా నాయకులు కలిసి రావాలి

జిల్లాకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి గారు చొరవ తీసుకోవాలని జిల్లా ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్న

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు వెన్ను దున్నుగా ఉండాల్సిన అవసరం ఉంది

రైతులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడేలా ట్రైనింగ్ క్లాసెస్ ను నిర్వహించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , అధికారులు ఉన్నతాధికారులు సన్నాహాలు కొంతమంది రైతులను సెలెక్టెడ్ గా విదేశాలకు తీసుకెళ్లి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేలా మంత్రి చొరవ తీసుకోవాలి

ఆర్థిక నిర్బంధము ఉన్న కూడా ఆరు గ్యారంటీ లతోపాటు సన్న బియ్యం పంపిణీ లాంటి చారిత్రాత్మక పథకాలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తుంది

ధనిక పేద తేడా లేకుండా సన్న బియ్యం పంపిణీని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో అమలు అవుతుంది

రానున్న రోజుల్లో హామీలను పూర్తిగా అమలు చేసేందుకు సీఎం రేవంత్, మంత్రుల బృందం కృషి చేస్తోంది

రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం 90 సీట్లుతో అధికారం లోకి రావడం ఖాయం

బిఆర్ ఎస్ పార్టీ లాగా మాట ఇచ్చి మోసం చేసే రకం కాదు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీ నైజం

నిజాంసాగర్ ప్రాజెక్టు ను ఎంత ఖర్చైనా వ్యయమైనా డి సెడ్మెంటేషన్ చేస్తే మరో లక్ష ఎకరాలకు నీరు అందుతుందని మంత్రి ఉత్తమ్ అన్నకివిజ్ఞప్తి చేస్తున్నా

దేశంలోనే గొప్ప ప్రాజెక్టు అయిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టును కూడా డి సెడ్మెంటేషన్ చేస్తే అదనంగా మరో రెండున్నర లక్షల ఎకరాలకు నీరు అందుతుంది

ఆనాడు రెండు ప్రాజెక్టులతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సస్యశ్యామలంగా మారడం చూసి ఆంధ్ర రైతులు జిల్లాకు వలస వచ్చాము

సస్యశ్యామలానికి పేరుగాంచిన జిల్లాకు పునర్ వైభవం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

## పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం



ప్రపంచ క్రైస్తవులకు మార్గదర్శి, రోమన్ కాథలిక్ చర్చి పరమ గురువైన పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. క్రైస్తవ సమాజానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోప్ అనుయాయులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ప్రేమ, కరుణ మార్గాలను బోధిస్తూ, పేదల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, శాంతి స్థాపన, అంతర్ధార్మిక సామరస్యం కోసం పోప్ ఫ్రాన్సిస్ చేసిన కృషి అసాధారణమని, స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి కొనియాడారు.అర్జెంటీనాలో సామాన్య కుటుంబంలో జన్మించి, పోప్ స్థాయికి ఎదిగిన ఆయన, తన నిరాడంబర జీవనశైలితో, ప్రజలకు చేరువై, వాటికన్ సిటీని, పోప్ స్థానాన్ని సామాన్యులకు మరింత సన్నిహితం చేసిన మహోన్నత గురువర్యులుగా చరిత్రలో నిలిచిపోతారని ముఖ్యమంత్రి అన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన పోప్ ఫ్రాన్సిస్ గారి బోధనలు మరియు సేవలు రాబోయే తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ దుఃఖ సమయంలో క్రైస్తవ సమాజానికి అండగా నిలుస్తున్నామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాంతి, ఆయన భక్తులకు మనోధైర్యం కలగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

## నెలాఖరులోగా శ్రీరాంసాగర్,నిజాంసాగర్ ప్రాజెక్టుల పూడిక తీతకు టెండర్లు

**కాళేశ్వరం 20,21,22 ప్యాకేజీలతో పెండింగ్ పనులతో పాటు గుత్ప ఎత్తిపోతల పథకం మిగులు పనుల పూర్తికి శ్రీకారం**

**రైతు మహోత్సవాలు రైతాంగానికి మార్గదర్శనంగా నిలుస్తాయి**

**ఈ తరహా సదస్సులు ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది**

**సన్న బియ్యం పంపిణీతో రీ సైక్లింగ్ కు చెక్,దాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి**

**-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**నిజామాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఏప్రిల్ మాసంతానికి శ్రీరాంసాగర్,నిజాంసాగర్ ప్రాజెక్టుల పూడిక తీత పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

తద్వారా లక్షలాది ఎకరాల అదనపు ఆయకట్టును సేద్యంలోకి తీసుకు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సోమవారం రోజున నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనీ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రైతు మహోత్సవ సభకు ఆయన సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులతో కలసి పాల్గొన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ,పోచారం శ్రీనివాసరెడ్డి,

పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి,భూపతి రెడ్డి,సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ స్థాల్స్ ను వారు సందర్శించారు.ఆధునిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయ యంత్ర సామగ్రి, వ్యవసాయ ఉత్పత్తులు, అధిక దిగుబడులను అధునాతన వంగడాలతో పాటు మేలు జాతి పశువులు, ఇతర ఆహార పదార్థాలతో కూడిన 150 స్థాల్స్ ను వారు సందర్శించారు.

ఆధునిక పద్ధతులతో కూడిన లాభసాటి వ్యవసాయ పద్ధతులతో పాటు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులనందించే వంగడాల వినియోగంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆదర్శ రైతుల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల శాఖా వ్యవసాయ శాఖా పరస్పరం సమన్వయం చేసుకోవడంతో తెలంగాణా రాష్ట్రంలో ముందెన్నడూ లేని రీతిలో దాన్యం దిగుబడి యావత్ భారత దేశంలోనే రికార్డ్ సృష్టిస్తుందన్నారు

గత ప్రభుత్వం నీటిపారుదల రంగంపై 81 వేల కోట్లు ఖర్చు పెట్టినప్పటికి సాగునీటి రంగంలో సాదించింది ఏమి లేదని ఎత్తిపొడిచారు

అనాలోచిత నిర్ణయాలతో కాళేశ్వరం ప్రాజెక్టు చెప్పట్టి లక్షా 25 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆయన మండిపడ్డారు

ఉమ్మడి జిల్లాలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులను కుడా ఆ ప్రభుత్వం పూర్తి చేయలేక పోయిందని ఆయన దుయ్యబట్టారు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టు నుండి చుక్క నీటిని వినియోగించుకోకుండానే రాష్ట్రంలో ముందెన్నడూ లేని రీతిలో రికార్డ్ స్థాయిలో దాన్యం దిగుబడిని సాధించి రికార్డు నెలకొల్పామన్నారు.

ఖరీఫ్, రబీ సీజన్ లో రాష్ట్రంలో ఉత్పత్తి అయిన 281 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం దిగుబడి ఇందుకు నిదర్శనమన్నారు

దేశంలోనీ మరే ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఇంతటి స్థాయిలో దాన్యం దిగుబడి అయిన దాఖలాలు మచ్చుకైనా కనిపించడం లేదన్నారు

తెలంగాణా రైతాంగం పండించిన పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకుందన్నారు.

రైతాంగానికి మద్దతు ధర అందించడంతో పాటు సన్నాలు పండించిన రైతాంగానికి క్వింటాలు ఒక్కంటికీ అదనంగా 500 రూపాయల బోనస్ ను అందించడం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన సందర్భంగా ఆయన అభివర్ణించారు

దాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌళిక సదుపాయాల కల్పనతో పాటు దాన్యం కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలోనే వారి వారి ఖాతాలలో నగదును జమ చేస్తున్నామన్నారు.

రబీ సీజన్ లో దాన్యం దిగుబడి అంచనాకు తగ్గట్టుగా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచమన్నారు

గన్నీ బ్యాగుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు కఠినాత్మకంగా ఉంటాయని ఆయన హెచ్చరించారురాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలందరికీ ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పంపిణీ అంశాన్ని ఆయన ప్రస్తావిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థలో ఇదొక నూతన అధ్యాయంగా ఆయన పేర్కొన్నారురాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయమన్నారు.గతంలో 10,625 కోట్లు ఖర్చు పెట్టి 2.81 కోట్ల మందికి దొడ్డు బియ్యం పంపిణీ చేసినా ఆశించిన ఫలితాలు రాకపోవడంతో పాటు దొడ్డు బియ్యం పక్కదోవ పట్టి అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారుదొడ్డు బియ్యం తీసుకున్న లబ్దిదారులు వాటిని వినియోగించుకోక పోగా తిరిగి అమ్ముకోవడంతో రీ సైక్లింగ్ వంటి అక్రమ దందాలు చోటు చేసుకున్నాయన్నారు.

వీటన్నింటినీ అధ్యయనం చేసిన మీదట రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ నిర్ణయంతో ఈ అక్రమాల అన్నింటికి చెక్ పెట్టినట్లైందన్నారు.

మిగతా 3 లో

ప్రజాబలం

22 ఏప్రిల్ 2025 మంగళవారం

# దేశంలో గుణాత్మకమైన మార్పులు మొదలు అవుతున్నాయి

## మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 21(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం నిర్వహించారు, సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ దేశంలో గుణాత్మకమైన మార్పులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారని, సంచలనాత్మక బిల్లులు తెస్తూ ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు, వక్ఫ్ సవరణ చట్టంపై పేద ముస్లింలలో అపోహలు సృష్టిస్తూ అల్లర్లు రేపే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు, ఈ చట్టం ద్వారా వక్ఫ్ పేరిట భూములు అక్రమంగా తీసుకోవడం ఆగిపోతుందని స్పష్టం చేశారు, జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 12,892 ఎకరాలు వక్ఫ్ భూములుగా నమోదు చేయడం వల్ల వేల మంది రైతులు హక్కులు కోల్పోయారని తెలిపారు, కొండాపూర్ మండలం సైదాపూర్ లో 197 ఎకరాలు వక్ఫ్ జాబితాలో చేరడం వల్ల సుమారు 200 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్కల్, రాయికోడ్ మండలాల్లో పెద్ద ఎత్తున భూములు వక్ఫ్ జాబితాలో చేరాయని ఆరోపించారు,రాష్ట్రంలో పాతబస్తీ వక్ఫ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా వివరాలు ఇవ్వాలనీ, ముతావలీలు ఎవరి పేర్లపై లీజులకు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు,పట్టణాల్లో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురవుతున్నా, అసలు లబ్దిదారులైన పేద ముస్లింలకు ఉపయోగం లేకుండా పోతోంది. తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు. రైతులు, ప్రజలు చట్టంపై అవగాహన పెంచుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వ మౌనాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

# రవివర్మ చిత్రాలకు ప్రేరణ అంజనీబాయి మాల్పేకర్

“రవివర్మకే అందని ఒకేఒక అందానివో” “రవి చూడని పాడని నవ్య నాదానివో” అంటూ “రావణుడే రాముడైతే” చిత్రం (1980)కోసం, వేటూరి సుందర రామమూర్తి కలం నుండి జాలువారి, బాలు – జానకి గళాల నుండి అలవోకగా, సుమధురంగా గానం చేయబడిన పాట, సంగీత ప్రియులకు సుపరిచితమే.చిత్రకళకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చిన చిత్రకారుడు రాజా రవివర్మ. హైందవ సంస్కృతిలో అంతర్భాగమైన రామాయణ, మహాభారత ఆది పురాణాలలో ఘట్టాలను, చిత్రాలుగా మలిచి, గుర్తింపు పొందారు రాజా రవివర్మ. ఆయన తన చిత్రాలను, దక్షిణ భారత స్త్రీల లాగా ఊహించి, అందంగా చిత్రించే వాడు. ముఖ్యంగా మహా భారతంలోని నల దమయంతుల, శకుంతల దుష్యంతుల కథలలోని ఘట్టాలను, చిత్రాలుగా చిత్రించి ఎంతో పేరు సంపాదించారు. భారతీయుల ఊహలలో, తమ పురాణాలలో ఉన్న పాత్రలు రవివర్మ రూప కల్పన చేసిన చిత్రాల్లాగా మారిపోయాయి అంటే అతిశయోక్తి లేదు. రవివర్మ చిత్రాలకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులున్నారు. మరి ఆయన చిత్రాల్లో కనిపించే ముగ్ధమనోహర సౌందర్యవతి నిజంగానే ఈ భూమి మీద ఉందా లేదా ఊహా సుందరియా అన్న అనుమానం చాలామందికి వస్తుంది. అయితే అంజనీ బాయి మాల్పేకర్ రవివర్మ చిత్రాలకు నమూన అని అంటారు. సంగీత కళాకారిణిగానే ఎక్కువ మందికి తెలిసిన ఆమె... రవివర్మ కుంచెతో ప్రాణం పోసుకున్న లేడీ ఇన్ ది మూన్లైట్”, “లేడీ ప్లేయింగ్ స్వర్బాట్”, “మోహిని” ,”ది హార్ట్‌బ్రోకెన్” తదితర చిత్రాలకు ప్రేరణ అని అతి తక్కువ మందికి తెలుసు. పండిత్ అంజనీబాయి మాల్పేకర్ (22 ఏప్రిల్ 1883 – 7 ఆగస్టు 1974) ప్రముఖ భారతీయ సంప్రదాయ సంగీత గాత్ర కళాకారిణి. హిందూస్థానీ సంగీతంలో ఖెండి బజార్ గరానా శైలిలో ఆమె ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఆమె ప్రముఖ సంగీత విధ్యాంసుడు ఉస్తాద్ నజీర్ ఖాన్ శిష్యురాలు. గోవాలోని మాల్పేలో 22 ఏప్రిల్ 1883లో కొంకణి భాష మాట్లాడే గోవా సంగీత కారుల కుటుంబంలో అంజనీ జన్మించారు. ఆమె తాత గుజాబాయి, తల్లి నబుబాయిలు సంగీత ప్రపంచంలో చాలా ప్రసిద్ధి చెందిన వారు. తన 8వ ఏట ఉస్తాద్ నజీర్ ఖాన్ వద్ద ఖెండి బజార్ గరానా శైలిలో సంగీత శిక్షణ తీసుకున్నారు. గురువుతో పాటు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందుకున్న మొదటి మహిళగా ఆమె పేరు నమోదు చేసుకున్నారు. ఎనిమిదేండ్ల పాటు కఠోన సంగీత సాధన చేసిన ఆమె 1899లో తన 16వ ఏట ముంబైలో మొదటిసారి కచేరి చేశారు. ఆ సమయంలో మహిళలు ప్రదర్శనలు ఇచ్చేవారు కాదు. కానీ అంజనీ మాత్రం తన కచేరీల ద్వారా ఎంతో గౌరవం పొందారు. 1920 వరకు ఆమె సంగీత కెరీర్ చాలా బాగా సాగింది. అయితే ఆమె గురువు చనిపోవడంతో ప్రజా ప్రదర్శనలకు దూరమైనారు. అందమైన ఆమె రూపం కూడా ప్రదర్శనలకు దూరం కావడానికి ఒక కారణం. కచేరిలో కొందరు ప్రేక్షకుల నుంచి వచ్చే వేధింపులు ఆమెను బాధించేవి. దాంతో ఆమె కచేరిలు ఆపేసి 1923 నుంచి పూర్తిగా సంగీత శిక్షణకే సమయం కేటాయించేవారు. ఆమె వద్ద సంగీతం నేర్చుకున్న కుమార్ గాంధర్వ, కిషోర్ అమోంకర్ ప్రసిద్ధ సంగీత కళాకారుడిగా పేరు తెచ్చుకున్నారు. అద్భుతమైన గాత్రంతో పాటు అపూర్వమైన అందం ఆమె సొంతం. ప్రముఖ చిత్రకారుడు ఎం.వి. ధురంధర్ ఆమె చిత్రాన్ని గీసినప్పుడు రవివర్మ చూసి అబ్బురపడ్డారట. తమ చిత్రాల ర్పూప కల్పనకు ఆమెను ప్రేరణగా తీసుకున్నారు. “లేడీ ఇన్ ది మూన్లైట్”, “లేడీ ప్లేయింగ్ స్వర్బాట్”, “మోహిని”, “ది హార్ట్‌బ్రోకెన్” తదితర చిత్రాలకు అంజనీ ప్రేరణగా నిలిచారు. 1958లో, కేంద్ర సంగీత నాటక అకాడమీ వారు ఇచ్చే సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందుకొన్న మొట్ట మొదటి మహిళగా నిలిచింది అంజనీబాయి.

# శ్రీ రామ్ అరుణ ఫ్యామిలీ ఫౌండేషన్ ద్వార విద్యార్థుల చదువుకు ఆర్థిక సహకారం.




**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 21(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సదాశివపేట:బుద్ధ పార్లమ వానవిక్లబ్ హైదరాబాద్ వాసవి క్లబ్ సమితి సదాశివపేట సహకారంతో శ్రీ రామ్ అరుణ గుప్త ఫ్యామిలీ ఫౌండేషన్ ద్వార శ్రీ సరస్వతి శిశు మందిర్ సదాశివపేట్ పాఠశాలలో 5 మంది అతి బీద విద్యార్థులయిన( 1)వరుణ్ (2)అఖిల (3 ) సాయిరాం(4) కే రవితేజ (5) వరుణ్ తేజ, వారి చదువుకు ఆటంకం లేకుండా వారికి సంవత్సరం శుల్కాన్ని చేక్క్ రూపంలో శ్రీ రామ్ అరుణ గుప్త ఫ్యామిలీ ఫౌండేషన్ ట్రెజరర్ అయిన బొజ్జ మధుసూధన్ (91000) రూ.ల చెక్కును పాఠశాల సెక్రెటరి సరాప్ శ్రీనివాస్ మరియు పాఠశాల ప్రధానాచార్యులు తమ్మలి సంగమేశ్వర్ కు అందించారు.దీనికి సంబందించి బుద్ద పార్లమ వాసవి క్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు మ్యాడం చంద్రశేఖర్, మంచుకొండ రఘు కుమార్ సెక్రటరి, పెద్దలు వీర్ల మళ్ల సుధాకర్, వేముల వీరేశం సహకరించారు,వీరితో పాటు వాసవిక్లబ్ సదాశివపేట ప్రెసిడెంట్ శ్రీనివాస్,పాండు, సింగారపు జగన్,గుండాం సతీష్, ఆర్థిక సహకారం రావడానికి సహకరించారు. మరియు పాఠశాల కార్యదర్శి సరాప్ శ్రీనివాస్ కోశాధికారి, తాటికొండ వైద్యనాథ్ , సభ్యులు పురం కృపాకర్ కూడా పాల్గొన్నారు .శ్రీ రామ్ అరుణ గుప్తా ఫ్యామిలీ ఫౌండేషన్ ట్రెజరర్ మధుసూదన్ మాట్లాడుతూ తను 31 సంవత్సరాల వయసులో ఉన్నపుడు తను చైరంగి అప్టికల్స్కు వెల్లినపుడు ఛైరంగి ఫౌండేషన్ అప్లికేషన్ ఫామ్ తీసుకోని ఒక వ్యక్తి వచ్చినపుడు మధుసూదన్ ఆ షామ్ ని చూసారు. అందులో 1800 ల నుండి 2000 మంది పేద విద్యార్థుల చదువుకు ఇచ్చిన స్కాలర్షిప్ ఫామ్స్ ని చూసి తను కుడా పేద విద్యార్థుల చదువుకు సహాయం అందించాలని అనుకొని 2016 నుండి ఈ విధంగా వీరు పేద విద్యార్థుల చదువుకు సహాయం చేస్తూ ఉన్నారు.ఇట్టి సహాకారాన్ని అందించినందుకు శ్రీ సరస్వతీ శిశు మందిర్ సదాశివపేట్ పాఠశాల తరుపు నుండి శ్రీరామ్ అరుణ గుప్త ఫౌండేషన్ వారికి ధన్యవాదాలను తెలిపారు. ఈ ఆర్థిక సహకారం నాలుగు సంవత్సరాలు వీరికి అందిస్తామని అందుకు మీరు చక్కగా చదువుకొని భవిష్యత్తులో చక్కటి విద్యార్థులుగా ఎదిగి మంచి ఉద్యోగాలు చేయాలని , అమ్మానాన్నలను చక్కగా చూసుకొని సమాజంలో చక్కటి పౌరులుగా ఎదగాలని కోరారు.

# అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ గో బ్యాక్

## భారత వ్యవసాయ మార్కెట్ ను కభలించే యత్నం

## సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 21(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటన సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ పక్కన వీరనారి ఐలమ్మ విగ్రహం దగ్గర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపడం జరిగింది.ఈ సందర్భంగాతెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజ్ మాట్లాడుతూ.భారత వ్యవసాయ మార్కెట్ కంభలించే ఉద్దేశంతోనే అమెరికా ఉపాధ్యక్షుడు వాన్సు పర్యటన అని ఐలమ్మ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నిరసనలు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత వాణిజ్య పనుల సుగాల పేరుతో భారత దేశంలోనికి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు అని అన్నారు గతంలోనే భారత ప్రభుత్వ వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయడంతో ప్రపంచ వాణిజ్య సంస్థ డబుల్టీవోలో కేసు వేసింది అన్నారు అమెరికా వాణిజ్య పనుల ఒత్తిడికి భారత ప్రభుత్వము లొంగిపోతే భారత దేశంలో వ్యవసాయం మరింత సంక్షోభంలోకి పోతుంది అన్నారు అమెరికాలో ట్రంప్ ఆర్థిక వాణిజ్య పన్నుల విధానంపై ప్రజల తిరుగుబాటు బావుటవేసి ఆందోళన చేస్తున్నారు అని అన్నారు ఇప్పటికే అమెరికన్ నుంచి పత్తి దిగుమతి ఎక్కువ అయ్యిందని అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు భారతదేశము తక్కువ వేస్తే వరి ధాన్యం గోధుమలు మొక్కజొన్న పాలు దిగుమతులు పెరిగి భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు లేక రైతుల పూర్తిగా అవకాశాలు ఎక్కువగా ఉంటాయి అని అమెరికా అధ్యక్షుడిని భారత దేశంలో నుండి గో బ్యాక్ అని నినాదాలు చేస్తూ ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమల మాణిక్,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజయ్య, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రామాంజనేయులు, రామచందర్, ఆవాజ్ నాయకులు నసీర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# మారుతి నగర్ లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

## -వార్డుకు కాకా వెంకటస్వామి పేరు

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండి సదానందం యాదవ్





**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 21** :మందమర్రి పట్టణంలోని 23 వ వార్డు మారుతీ నగర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండి సదానంద యాదవ్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి నోచుకోక మారుతి నగర్ వెనుకబడి ఉందని ఆయన పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ వివేక్ వెంకటస్వామి గెలుపొందాక వారు ఇచ్చిన హామీలకు కట్టుబడి అభివృద్ధి పనులు మొదలుపెట్టారని ఆయన తెలిపారు. 23 వ వార్డు మారుతీ నగర్ లో డ్రైనేజీ, వీధిలైట్ల కోసం కరెంటు పోల్స్ నిర్మాణం, వార్డులో సిసి రోడ్లను వేయడం జరుగుతుందన్నారు. వార్డుకు కాకా వెంకటస్వామి పేరును నామకరణం చేసుకుందామని నిర్ణయించుకున్నామని తెలిపారు. వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి సదానందం యాదవ్ ను వార్డు ప్రజలు సన్మానించారు.

# భూభారతి అవగాహన సదస్సు

# ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి







**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 21:**రాష్ట్ర ప్రజలకు భూభారతి చట్టం ఎలా చుట్టమవుతుందో త్వరలోనే తెలుస్తుందని రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ మండలం అత్వెల్లి గ్రామంలోని జిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సు కు మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముందుగా ధరణిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు వారి సమస్యల నన్నింటినీ భూభారతిలో పరిష్కారం దొరుకుతుందని ఏమైనా అవసరమైన మేరకు రైతుల ప్రజల సలహాలు సూచనలు కూడా ఈ చట్టంలో పొందుపరుస్తామని మంత్రి తెలిపారు ఇకపై గ్రామాలలో మీ సమస్యలు తెలుసుకోవడానికి రెవెన్యూ అధికారులే మీ ఇంటికి మీ ఇంటి వద్దకు వస్తారని మీరు చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగేది ఉండదని మంత్రి స్పష్టం చేశారు వీఆర్ఏ వ్యవస్థను పునరుద్ధరిస్తామని సర్వేయర్లను నియమిస్తామని మంత్రి పేర్కొన్నారు చట్టంలో సాదా బైనామా అంశాన్ని భూధార్ న్యాయ భూ సమస్యలపై న్యాయ వ్యవస్థను పొందుపరచడం జరిగిందని దీనివల్ల రైతులకు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు ఎమ్మార్వో స్థాయి నుండి సీసీఎల్ఏ స్థాయి వరకు అధికారాలు హక్కులు కల్పించడం జరిగిందని మీరు ఎవరికైనా ఆ ఫీల్ చేసుకోవచ్చు అని అన్నారు ఇకనుండి రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు తప్పనిసరిగా సర్వే మ్యాప్ ఉంటుందని అన్నారు ప్రజలకు మంచి పని చేసే అవకాశం ఈ ఈ ప్రభుత్వానికి వచ్చిందని ఈ చట్టం వలన అధికారాలే కాకుండా తప్పు చేసిన వారిని శిక్షించే అధికారం కూడా ఈ చట్టంలో ఉందన్నారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో విధాలుగా ఆలోచించి ధరణిలోని సమస్యలను తొలగించి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని, దీని వలన ప్రతి ఒక్కరి భూ సమస్యలకు పరిష్కారం కలుగుతుందని అన్నారు. ధరణిలో సమస్యలను, దాని వల్ల నష్టపోయిన వారికి మేలు చేయాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఎంతో కృషి చేసిఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. అనుభవం కలిగిన రిటైర్ ఉద్యోగులు, నిపుణులు ఎంతో మందితో చర్చించి ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందిందన్నారు. ధరణిలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారలు, హక్కులు లేకుండా, ప్రతి సమస్యకు కోర్టుకు వెళ్లవలసి ఉండేదని, ప్రతి ఒక్కరు కోర్టుకు వెళ్లలేనందున అధిక సంఖ్యలో సమస్యలు మిగిలిపోయాయని కలెక్టరు తెలిపారు. కోర్టులకు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించే విధంగా భూభారతి చట్టంలో తహాసీల్దారు స్థాయి నుండి సిసిఎల్ఎ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే వెసలుబాటు కల్పించడం జరిగిందన్నారు. ధరణిలో భూ కొనుగోలు, అమ్మకాలే కాకుండా భూరికార్డులలో పేర్ల మార్పులకు కూడా చాలా ఇబ్బంది కలిగిందని అన్నారు . ధరణిలో నష్టపోయినవారు ఇప్పటికి కొత మంది కి న్యాయం జరగలేదని, భూ భారతి చట్టం ద్వారా భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. ధరణిలో విఆర్ఓ వ్యవస్థను తీసివేయడం ద్వారా గ్రామాలలో రైతుల చిన్న చిన్న భూసమస్యలు పెరిగిపోయాయన్నారు. ఇప్పుడు గ్రామ పరిపాలనాధికారి నియామకాలతో గ్రామ సమస్యలను తహాసీల్దారు దృష్టికి తీసుకుపోయి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా భూభారతిలో ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యతులో శాటిలైట్ ఆధారంగా భూమికి సంబంధించి సర్వే చేసిన కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని, తద్వారా చాలా పకడ్బందీగా మ్యాపింగ్ ఉంటుందని కలెక్టరు తెలిపారు. ఈ భూధార్ విజయవంతమైతే భవిష్యత్తు తరాలకు ఏలాంటి భూ ఆక్రమణ సమస్యలు ఉండబోవన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకుగాను అధిక సంఖ్యలో సర్వేయర్లు అవసరమని, త్వరలోనే వేల సంఖ్యలలో సర్వేయర్లను నియమించేందు ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు. భూ భారతి ద్వారా ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేస్తామని కలెక్టరు అన్నారు. ఈ అవగాహన సదస్సులో నిపుణులు భూభారతి చట్టం పై మీకందరికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తారని, తర్వాత చట్టంలో ఏమి ఉన్నది అనే విషయాన్ని మీ ఊర్లో ప్రతి క్కరికి అర్థమయ్యేలా మీరు మిగిలిన వారికి చెప్పాలన్నారు. అంతే కాకుండా జన సమూహాలుగా ఉండే కార్యక్రమాలలోఈ చట్టం గురించి మీరు మాట్లాడుకోవాలని కలెక్టరు కోరారు.

భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ అధికారుల పై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టరు తెలిపారు.

# నెలాఖరులోగా శ్రీరాంసాగర్,నిజాంసాగర్ ప్రాజెక్టుల పూడిక తీతకు టెండర్లు

మొదటి పేజీ తరువాయి

పెండింగ్ లో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు 20,21,22 ప్యాకేజీ పనులతో పాటు గుత్ప ఎత్తిపోతల మిగులు పథకానికి నిధులు కేటాయించి పనుల పూర్తి చేస్తామన్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయం తోపాటు, ఆధునిక సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వ్యవసాయ మెళుకువలను అందించడానికి రైతు మహోత్సవ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని, దీనిని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరి కోరిక మేరకు నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

బోర్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి పసుపు రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు, పసుపు ఆధారిత పరిశ్రమలు, ఉత్పత్తులకు కూడా కేంద్రం చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా కోరుతామని తెలిపారు.

ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల ప్రయోజనాలే పరమావధిగా పంట రుణాల మాఫీ కింద రైతుల ఖాతాలలో 33 వేల కోట్ల రూపాయలను జమ చేశామని అన్నారు. త్వరలోనే రైతు భరోసా నిధులను కూడా రైతుల ఖాతాలలో జమ చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగానికి నష్ట పరిహారం సైతం అందించే ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా రైతుల నుండి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పెద్ద ఎత్తున వరి ధాన్యం కొనుగోలు చేస్తూ, సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుపుతున్నామని అన్నారు. తెలంగాణాలో ఉన్నది రైతు ప్రభుత్వమని, రైతాంగ సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రకృతి పరంగా, క్రిమికీటకాలు రూపంలో పంటల సాగుకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయని, అయినా కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు నష్టపోకుండా వారికి అన్ని విధాలా అండగా నిలువాలన్నదే తమ ప్రభుత్వ అభిమతమని వెల్లడించారు.

ఇతర దేశాల్లో ఎలాంటి పంటలు పండించి లాభం పొందుతున్నారు, ఆధునిక సాగు, కొత్త పంటల పై రైతులకు మూడు రోజుల ఈ మహోత్సవంలో శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పిస్తారని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యంత లాభదాయకమైన పంట పామాయిల్ అని, దీనిని జంతువులు , చీడ పురుగులు నష్టం చేయవని, అందువల్ల పామాయిల్ పంటను రైతులు సాగు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయించే బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. కాగా, వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల తెలిపారు.

వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ లను మళ్లీ పునరుద్ధరిస్తూ, నిజామాబాద్ జిల్లాకు వీటి మంజూరీలో ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రైతాంగానికి తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్ర ఖజానా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి రాష్ట్రాన్ని 64 సంవత్సరాల పాటు పాలించిన 21 మంది ముఖ్యమంత్రులు 64 వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తే, వాటిపై సంవత్సరానికి 6 వేల కోట్ల రూపాయల వడ్డీ అయ్యేదని అన్నారు. అయితే, గత ప్రభుత్వం కేవలం పది సంవత్సరాల వ్యవధిలోనే రాష్ట్ర అప్పును 8 లక్షల కోట్లకు చేర్చిందని, ఫలితంగా ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతీ నెల వడ్డీ రూపంలోనే 6 వేల కోట్లు, సంవత్సరానికి 70 వేల కోట్ల రూపాయలు కట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు లక్షా 40 వేల కోట్ల రూపాయలను అప్పులపై వడ్డీల కింద చెల్లియించాల్సి వచ్చిందని ఆవేదన వెలిబుచ్చారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, నుడా ఛైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులుగా ఎంపిక చేసిన రైతులకు సబ్సిడీతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర, పరికరాలు పంపిణీ చేశారు

# ప్రాథమిక పాఠశాలలో ఘనంగా కాన్వోకేషన్ డే వేడుకలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 21:**మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల– ఫిల్టర్ బెడ్ పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ ల ప్రధానం కార్యక్రమం వేడుకగా నిర్వచించడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య అతిథులుగా మందమర్రి మండల విద్యాధికారి దత్తుమూర్తి,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పద్మజ హాజరై సర్టిఫికేట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతమైన జ్ఞాననిర్మాణం కోసం పరితపించే ఉపాధ్యాయులు ఎంతో కృషీ చేస్తున్నారని, తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని సాదిస్తున్నారని, వినూత్నరీతుల్లో విద్యాబోధన చేస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో ప్రత్యక్ష బోధనాపద్దతుల ద్వారా మండలంలోనే అత్యధిక విద్యార్థులు ఫిల్టర్ బెడ్ పాఠశాలలో చేసి విద్యను అభ్యసిస్తున్నారని ఉపాధ్యాయుల సేవలను వారు అభినందించారు. పాఠశాల ప్రత్యేకతలు అడ్మిషన్ ల ప్రారంభం – ప్రత్యేకత లు తెలియజేసే కరపత్రాలను విడుదల చేయటం జరిగింది.ప్రతిభ కనబరిచిన విద్యార్థుల విద్యార్థులకి ప్రత్యేక బహుమతులు ఇవ్వడం జరిగింది.తల్లితండ్రులు పెద్దఎత్తున హాజరై ఆద్యంతం పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి , విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసాచారి,ఉపాధ్యాయులు జనగామ ఉమాదేవి, భీంపుత్ర శ్రీనివాస్ జలంపెల్లి, చింతకింది లలిత, గుడివెనుక రవి, అమ్మ ఆదర్శం పాఠశాల పాఠశాల చైర్మన్ దూలం అంజలి, పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఏపీలో స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు

విజయవాడ. ఏప్రిల్ 21 రోడ్డుపై నడిచి వెళ్తున్నప్పుడూ లేదా వాహనాల్లో వెళ్తున్నప్పుడు రోడ్డుపక్కన వీధి వ్యాపారులను మనం గమనిస్తూనే ఉంటాం. తినుబండారాల దగ్గర నుంచి వస్తువుల వరకూ విక్రయిస్తూ ఉంటారు. పొట్టకూటి కోసం రహదారుల పక్కన, తోపుడు బండ్ల మీద చిరువ్యాపారులు.. తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఉంటారు. కూటి కోసం కోటి కష్టాలు అన్నట్లుగా వారి ఇబ్బందులు వారివి. అయితే వీధి వ్యాపారుల కారణంగా అప్పడప్పుడూ రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ ఉంటుంది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ నేపథ్యంలో వారి జీవనోపాధి దెబ్బతీయకుండా.. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు అమలు చేస్తోంది.పట్టణాల్లో రద్దీ?ని నియంత్రించేందుకు, వీధి వ్యాపారులకు పరిశుభ్రమైన వ్యాపార పద్ధతులు అలవాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2013లో ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించింది. స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద వీధి వ్యాపారులకు కంటైనర్ షాపులు నిర్మించి ఇవ్వనున్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 200 కంటైనర్ షాపులు నిర్మించి వీధి వ్యాపారులకు అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నెల్లూరు మైపాడు రోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పుడు శ్రీకాకుళంలోని కొత్తవంతెన రహదారిలోవీధి వ్యాపారులకు కంటైనర్లు నిర్మించి ఇవ్వనున్నారు.పట్టణాలు, నగరాల్లో రోడ్ల పక్కన ఆహార పదార్థాలు, వ్యాపారాలు చేసేవారికి స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద కంటైనర్లు కేటాయిస్తారు. 18 ఏళ్లు పైబడి ఉండాలి. అలాగే స్థానిక సంస్థలో వివరాలు నమోదు చేసుకుని ఉండాలి. అర్హులకు స్ట్రీట్ వెండర్స్ కమిటీ ద్వారా అందరి సమక్షంలోనే ఈ కంటైనర్ దుకాణాలు కేటాయిస్తారు. ఒకే రకమైన ఆహార పదార్థాలు, ఉత్పతులు విక్రయించేవారికి వీటిని కేటాయిస్తారు. ఈ కంటైనర్ దుకాణాలలో అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలు, రూఫ్ టాప్ సీలింగ్, సోలార్ విద్యుత్తు, ఉచిత వైఫై, అధునాతన ఫర్నీచర్ ఉంటాయి. అలాగే ఆహార పదార్థాల తయారీ, మార్కెటింగ్‌పైనా ప్రత్యేక శిక్షణ అందిస్తారు.

# ఎమ్మెల్సీ అనంతబాబుకు ఉచ్చు

కాకినాడ. ఏప్రిల్ 21 తన దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి ఆపై డోర్ డెలివరీ చేసిన సంఘటన పై ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.. దీనిపై తమకు ఇంకా సరైన న్యాయం జరగలేదంటూ మృతుడి కుటుంబికులు ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది.. కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం రంపచోడవరంకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.. చాలా కాలంగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం మానేశాడు.. ఇదిలా ఉంటే 2022 మే 19న ఇంటి నుంచి వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. అయితే తెల్లవారు జామున ఓ కారులో గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం మృతదేహం తీసుకొచ్చి వదిలి వెళ్లిపోయాడు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. దళిత సంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి.. అయితే వైసీపీ ప్రభుత్వం నిందితున్ని కాపాడుతోందని ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి.. ఈక్రమంలోనే అత్యంత దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు పై కాకినాడ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పట్లో పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్‌చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అలియాస్ అనంత బాబు డోర్ డెలివరీ కేసులో న్యాయ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ న్యాయ విచారణలో ప్రాసిక్యూషన్ కు సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ మరియు మానవ హక్కుల రక్షణ కోసం సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ముప్పాళ్ళ సుబ్బారావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 538 ని విడుదల చేసింది. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ముప్పాళ్ళ సుబ్బారావు అండగా నిలిచారు. వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు నేనున్నానంటూ నిలబడ్డారు. ముప్పాళ్ళ సుబ్బారావు మడమతిప్పని పోరాటం వల్ల ఎమ్మెల్సీ అనంత బాబుకు స్థానిక న్యాయస్థానాల్లో బెయిల్ లభించలేదు. చివరికి సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం అనంత బాబు బెయిల్ పై ఉన్నారు. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులు తప్పించుకునే విధంగా పోలీసులు చార్జిషీట్ రూపకల్పన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.. హత్య సంఘటన అనంతరం 88 రోజులకు దాఖలు చేసిన చార్జిషీట్‌ను అప్పట్లో న్యాయ స్థానం తిరస్కరించింది. అందులో సాంకేతి ఆధారాలు, నిందితుల కదలికలు తదితర అంశాలు లేకుండా చార్జిషీట్‌లో లేకపోవడమే తిరస్కరణకు కారణమని బాధితుల తరపున వాదించిన న్యాయవాది సుబ్బారావు వెల్లడించారు. 2023 ఏ?రపిల్ 14న అనుబంధ చార్జిషీట్‌ను వేశారు. గడువులో దాఖలు చేయకుండా నిందితుడుకు బెయిల్ వచ్చేవిధంగా అప్పటి ఎస్పీ, డీఎస్పీ ఆలస్యం చేశారని విమర్శలున్నాయి.. అప్పట్లో తానే హత్యచేశానని విచారణలో ఎమ్మెల్సీ అనంతబాబు అంగీకరించినట్లు మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించారు కూడా.. చార్జిషీట్ ఆలస్యం వల్లనే మధ్యంతర బెయిల్ వచ్చిందని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే మృతుడి తల్లితండ్రులు నూకాలమ్మ,సత్యనారాయణలు మాత్రం మూడేళ్ళుగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ కేసును రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా విచారణకు ఆదేశిస్తారని భావిస్తూ వచ్చారు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రత్యేక కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక న్యాయవాదిగా మంచి ట్రాక్ రికార్డు కలిగిన ముప్పాళ్ళ సుబ్బారావును ఈ కేసులో సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా నియమించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్సీ అనంత బాబు కేసులో న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఇప్పుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు దళితుల్లోనూ కలుగుతోందంటున్నారు..

# వేగంగా గిరిజన వర్శిటీ పనులు

విజయనగరం. ఏప్రిల్ 21 కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలసలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోంది. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.వీ. కట్టిమణి, డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్ సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు, తాజా పరిస్థితులపై వారితో సీఎం చంద్రబాబు మాట్లాడారు.గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించింది. అందులో ఇదివరకే రూ.340 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. మొత్తం 561 ఎకరాల గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో అడ్మిన్ బిల్డింగ్‌తో పాటు వసతి భవనాలు, అకడమిక్ బ్లాక్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు వేగవంతం చేయాలని వీసికి సీఎం చంద్రబాబు సూచించారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకరిస్తామని చంద్రబాబు వర్సిటీ వీసీకి చెప్పారు. యూనివర్సిటీకి తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, అప్రోచ్ రోడ్ పనులను త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వేగంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీకి 2 కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్ పనులు పూర్తి చేయాలని వీసి చెప్పగా... ఆ పనులు వెంటనే ప్రారంభిస్తామని చంద్రబాబు అన్నారు. 100 మంది టీచింగ్ స్టాఫ్ అవసరం కాగా, ప్రస్తుతం కేవలం 18 మంది మాత్రమే ఉన్నారని అధికారులు తెలిపారు. సిబ్బందిని మరింత పెంచాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకి లేఖ రాస్తానన్నారు సీఎం చంద్రబాబు. మే నెలలో నిర్వహించే యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకికి లేఖ రాస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అయింది. అప్పటి నుంచి అద్దె భవనాల్లో విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వర్సిటీ నిర్మాణ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఏదీ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వర్సిటీ నిర్మాణంపై మరోసారి దృష్టిసారించింది. ప్రస్తుతం 600 మంది విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతుండగా.. సొంత భవనాలు పూర్తయితే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఉద్యోగం సాధించేలా, నైపుణ్యం పెంచేలా బోధన ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబు గిరిజన యూనివర్సిటీ అధికారులను కోరారు. ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగాల సాధన దిశగా కోర్సులను అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# క్రాస్ ఓటింగ్ పైనే బీజేపీ ఆశలు

హైదరాబాద్, ఏప్రిల్ 21, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయించుకుంది. బీఆర్ఎస్ పార్టీకి సంఖ్యా బలం లేదు కాబట్టి బీఆర్ఎస్ నుండి అభ్యర్థిని నిలబెట్టలేదని ఆ పార్టీ నేత కేటీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ ఎవరికీ మద్దతివ్వదు.. ఎవరూ కూడా 24వ తేదీన ఓటు వేయకూడదని ప్రకటించారు. పోటీలో ఉన్న ఎంఐఎం, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటే.. ఎవరికీ మద్దతు ఇవ్వం, ఎవరికీ ఓటు వెయ్యమని ప్రకటించారు. విప్‌ను ధిక్కరించి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఓటు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు దాదాపు ఏకపక్షంగానే జరగనుంది. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మొత్తం ఓట్లు 110 ఉన్నాయి. ఇందులో 81 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు ఉన్నారు. 3 డివిజన్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికి ఎంఐఎం పార్టీ బలం 49 ఓట్లు. 1 ఎంపీ, 7 ఎమ్మెల్యేలు, 1 ఎమ్మెల్సీ, 40 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఆ పార్టీ అభ్యర్థి పోటీలో ఉన్నారు. గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలం 25 మాత్రమే. 3 రాజ్యసభ ఎంపీలు, 2 ఎమ్మె ల్సీలు, 5 ఎమ్మెల్యేలు, 15 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్ పార్టీకి ఉన్నారు. బీజేపీ పార్టీ బలం 19 ఓట్లు. 1 ఎంపీ, 1 ఎమ్మెల్సీ, 19 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అయితే ఈ పార్టీ అభ్యర్థిని నిలబెట్టింది. దీంతో పోటీ అనివార్యమయింది. కాంగ్రెస్ పార్టీ బలం 14 ఓట్లు మాత్రమే. 1 రాజ్యసభ ఎంపీ, 4 ఎమ్మె ల్సీలు, 2 ఎమ్మెల్యేలు, 7 కార్పొరేటర్లు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ కు సపోర్టు చేయాలని నిర్ణయించింది. ఎంఐఎం పార్టీ 49 ఓట్లతో బలంగా ఉండటం.. కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుండడంతో ఎంఐఎం పార్టీ విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తుంది. గెలవడానికి అవకాశం లేకపోయినప్పటికీ చివరి క్షణంలో బీజేపీ అభ్యర్థిని నలిబెట్టింది. గెలిచే అవకాశం లేకపోతే ఎందుకు నిలబెడతామని ప్రశ్నిస్తున్నారు. సీరియస్ గానే ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అంతర్గతంగా ఏమైనా ఆకర్ష్ ఆపరేషన్ చేశారో లేదో .. ఓటింగ్ రోజున తేలే అవకాశం ఉంది.

# కారుమూరి మెడకు 690 కోట్ల టీడీఆర్ స్కాం

ఏలూరు. ఏప్రిల్ 21 ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఏలూరు జిల్లా వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. ఆయన చేసిన కామెంట్స్ కూటమి ప్రభుత్వంతో పాటు మళ్ళీ పాత కేసులను బయటకు తోడేలా చేసేయంటూ టాక్ విన్పిస్తోంది.ఇటీవల ఎంపీపీ ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు చేసిన వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో వైసిపిపై దాడులు చేస్తే మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు వరకు ఇంటి నుండి బయటకు లాగి కొడతామనీ, గుంటూరు తర్వాత నరికి చంపేస్తామని కారుమూరి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీలో పెను దుమారాన్నే రేపుతున్నాయి. ఈ కామెంట్స్ పై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కూటమి నేతలంతా తీవ్రంగా స్పందించారు. తణుకు నియోజవర్గంలో కొందరు టిడిపి నాయకులు కారుమూరి వల్ల తమకు ప్రాణహాని ఉందంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేశారు.ఎప్పుడు సైలెంట్ గా ఉండే కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సైతం కారుమూరి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురంలో జరిగిన సభలో మాట్లాడుతూ?రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్న హెచ్చరించిన వర్మ?ఆ తర్వాత పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన సభలో మాత్రం కారుమూరిపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తల జోలికి వస్తే చేతులు, కాళ్లు నరికేస్తానంటూ కేంద్రమంత్రి ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.ఎవరినైనా చంపడానికి చేతులు లేకుండా, నడవడానికి కాళు లేకుండా చేస్తానంటూ కారుమూరిని హెచ్చరించారు. ఃఆఖీ బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతి చేసిన కారుమూరి నాగేశ్వరరావు త్వరలో జైలుకెళ్లడం ఖాయం అన్నారు. అయితే వర్మ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఇక కారుమూరి నాగేశ్వరరావు జైలుకి వెళ్లడం తప్పదంటూ రకరకాల టాక్స్ పొలిటికల్ సర్కిల్స్ లో విన్పిస్తున్నాయి. నెక్స్ట్ లిస్టులో కారుమూరి పేరు ఉందంటూ ఇప్పుడు అంతా చర్చించుకుంటున్నారట.ఃఆఖీ బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతికి కారుమూరి పాల్పడ్డారంటూ కేంద్ర మంత్రి వర్మ చేసిన కామెంట్లు ఇప్పుడు హాట్ టాపిగ్గా మారాయి. టీడీఆర్ బాండ్ల స్కాంలో అసలేం జరిగిందంటూ ఇప్పుడు అంతా ఆరా తీస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కారుమూరి..తన సొంత నియోజకవర్గమైన తణుకు పట్టణంలో అభివృద్ధి పేరుతో భారీ ఎత్తున సేకరించిన భూములపై ప్రస్తుత తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆరా తీస్తున్నారంట.తణుకు మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల స్కాంపై ఇప్పటికే ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. వాస్తవానికి 2014 నుండి 19 వరకు అప్పటి తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ తణుకు పట్టణ అభివృద్ధి కోసం 6వేల గజాలకు బాండ్లు ఇచ్చారు. అయితే 2019 నుండి 24 వరకు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు ఏకంగా 6 లక్షల గజాల వరకూ బాండ్లు ఇవ్వడంతో తీగలాగితే డొంక కదిలింది అన్నట్లు రాష్ట్రంలోనే భారీగా టీడీఆర్ బాండ్స్ స్కాం బయటపడేందుకు కారణమైందట.ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఏసీబీ విచారణ పూర్తయిందని..త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందట. అయితే ఏసీబీ నివేదికలో కారుమూరి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఆయన జైలుకెళ్లడం తప్పదనే చర్చ జరుగుతోంది. అయితే ఏసీబీ సమర్పించే నివేదికలో ఏముందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# బీసీ సభలో ఓసీ నాయకుడు హవా

విజయవాడ. ఏప్రిల్ 21 సజ్జల ఈజ్ బ్యాక్.. అవును కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న సజ్జల ఇప్పుడు మీడియా ముందుకొచ్చారు. ఆయన కమ్ బ్యాక్ కోసం వైసీపీ ఏకంగా ఓ సభ పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఆ సభ బీసీలది. మరి బీసీ సభలో ఓసీ నాయకుడు సజ్జల ఎందుకు అనే అనుమానం అందరికీ రావడం కామన్. సభ బీసీలది అయినా వైసీపీలో బీసీల తరపున మాట్లాడే నాయకులెవరూ లేరని కాబోలు సజ్జలని తెరపైకి తెచ్చారు. ఆయనతోనే ఉపన్యాసం ఇప్పించారు. వైసీపీ బీసీల పార్టీ అని చెబుతూ.. బీసీలకు పెద్దగా మాట్లాడే ఛాన్స్ ఇవ్వకుండా సజ్జలే లీడ్ తీసుకోవడం ఇక్కడ విశేషం. దీంతో టీడీపీ నేతలు ఓ రేంజ్ లో ట్రోలింగ్ మొదలు పెట్టారు. వైసీపీలో బీసీ నేతల పరిస్థితి ఏంటో ఈ సభతోనే అర్థమైపోయిందని అంటున్నారు టీడీపీ నేతలు.ఇటీవల కొంతకాలంగా సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో కనపడ్డంలేదు. సహజంగా జగన్ ఎక్కడుంటే ఆయన కూడా అక్కడ ఉండాలి. కానీ ఆయన లేకుండానే జగన్ నాలుగైదు సార్లు జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో కూడా మీటింగ్ లు జరిగాయి. సజ్జల లేకపోవడంతో చాలామందికి చాలా అనుమానాలొచ్చాయి కానీ, ఆయన ఇప్పుడు సడన్ ఎంట్రీ ఇవ్వడం విశేషం. ఇటీవల పొలిటికల్ అఫైర్స్ కమిటీ నాయకత్వం కూడా సజ్జలకే జగన్ అప్పగించడం మరో విశేషం. దీంతో జగన్ వద్ద ఆయన ప్రయారిటీ ఏమాత్రం తగ్గలేదని రుజువైంది.అధికారంలో ఉన్నప్పుడు సకల శాఖల మంత్రి అనే అపవాదు మోశారు సజ్జల. పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామందికి ఆయన టార్గెట్ అయ్యారు. కొందరు బయటపడి మాట్లాడేశారు, మరికొందరు సైలెంట్ గా ఉన్నారు. ఇంకొందరు ఏకంగా పార్టీ నుంచి బయటకొచ్చేసి కోటరీ అంటూ కేకలు వేశారు, కానీ ఫలితం లేదు. జగన్ మాత్రం సజ్జలపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. పార్టీ వ్యవహారాల్లో ఆయనకు పెద్దపీట వేశారు. ఇక తాజాగా బీసీ మీటింగ్ కూడా సజ్జల నేతృత్వంలోనే జరిగింది.వైసీపీ బీసీ సెల్ మీటింగ్ కి మాజీ మంత్రులు జోగి రమేష్, ధర్మాన కృష్ణదాస్, కారుమూరి నాగేశ్వరరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్ సహా అన్ని జిల్లాలనుంచి బీసీ నేతలు హాజరయ్యారు. అయితే కీలక ఉపన్యాయం మాత్రం సజ్జలదే. బీసీలంటే బ్యాక్ బోన్ క్యాస్ట్ అనే విషయాన్ని జగన్ నిరూపించారని అన్నారు సజ్జల. వైసీపీ నేతలు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయాలని, పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని సూచించారు. గతంలో కంటే మెరుగ్గా పూర్తిస్థాయి కమిటీలను ఈసారి నియమించుకుందామని అన్నారాయన. విశాఖలో బీసీ మహిళను మేయర్ పీఠం నుంచి తప్పించారని విమర్శించారు.అంతా బాగానే ఉంది కానీ సజ్జల రీఎంట్రీ కోసం బీసీ మీటింగ్ ని ఎంచుకోవడం హాస్యాస్పదం అంటున్నారు టీడీపీ నేతలు. బీసీ పార్టీ అంటే టీడీపీయేనని, బీసీలకు అవకాశాలిచ్చి, నేతలుగా ఎదిగే తోడ్పాటునిచ్చింది, ఇస్తోంది కూడా టీడీపీయేనని చెప్పారు. బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని వారు కౌంటర్లిచ్చారు.

# జూన్ 12 నాటికి 3 లక్షల గృహప్రవేశాలు

విజయవాడ, ఏప్రిల్ 21 ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి సర్కారు ఏర్పాటై.. మరికొన్ని రోజుల్లో ఏడాది పూర్తి కానుంది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని రేంజులో ఘన విజయం అందుకుంది ఎన్డీఏ కూటమి. మొత్తం 175 స్థానాలకు గానూ.. 164 చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో తిరుగులేని మెజారిటీతో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జూన్ 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్, మంత్రులుగా నారా లోకేష్ సహా కీలక నేతలు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. అయితే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి వచ్చే జూన్ 12తో ఏడాది పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఎన్డీఏ కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తైన సందర్భంగా కొత్తగా నిర్మించిన 3 లక్షల ఇళ్లను ప్రారంభించి.. గృహప్రవేశాలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు జూన్ 12వ తేదీని ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. మూడు లక్షల మంది పేదలకు ఇళ్లను అందించి.. అదేరోజు వారితో గృహప్రవేశాలు చేయించేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూన్ 12 వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మూడు లక్షల ఇళ్లల్లో ఇప్పటి వరకూ 1.70 లక్షలు పూర్తికాగా.. మరో 60 వేల ఇళ్లు తుది దశలో ఉన్నాయి. గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు ప్రభుత్వం అదనపు సాయం కూడా అందిస్తున్న విషయం తెలిసిందే.బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు సాయం అందిస్తున్నారు. గడువులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హౌసింగ్) అజయ్ జైన్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ప్రతిరోజూ జిల్లా కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిత్యం సమీక్షిస్తున్నారు. పనులను గడువులోగా పూర్తి చేసేలా సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

# గూడూరు సమీపం లో జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వెనకనుండి ఢీ కొట్టిన మరో లారీ



తిరుపతి సోమవారం తెల్లవారుజాము ఉదయం నాలుగున్నర గంటలకు జాతీయ రహదారి పై చిల్లకూరు జంక్షన్ కి దగ్గర్లో నెల్లూరు నుండి చెన్నై వైపు వెళ్లే మార్గంలో ఆగి ఉన్న లారీని వెనుక నుండి మరొక లారీ ఢీకొట్టింది. దాంతో, ఆగి ఉన్న లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది, ఈ ఘటన లో వెనక నుండి గుద్దిన లారీ డ్రైవర్ క్యాబిన్లో ఇరుక్కుపోయాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై మనోజ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్ ని బయటకు తీసి గూడూరు గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించారు. రోడ్డుపై బోల్తా పడిన లారీని పక్కకు జరిపి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

# కొరగాని కొయ్యగా ఆదినారాయణరెడ్డి

కడప, ఏప్రిల్ 21 జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యవహార శైలి చర్చకు దారితీస్తోంది. గత కొద్దిరోజులుగా స్థానిక పరిశ్రమల యాజమాన్యాలకు, ఆయనకు మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో కొంతమంది నేతలతో సైతం ఆయన వివాదాలు పెట్టుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన అనంతపురం జిల్లాకు చెందిన టిడిపి నేత జెసి ప్రభాకర్ రెడ్డి వర్గీయులతో వివాదం నడిచింది. అక్కడకు కొద్ది రోజుల తరువాత సొంత పార్టీ ఎంపీ సీఎం రమేష్ తో సైతం విభేదించారు ఆదినారాయణ రెడ్డి. ఇప్పుడు స్థానికంగా ఉన్న ఓ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తోందని ఆరోపిస్తున్నారు ఆదినారాయణ రెడ్డి. స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని చెబుతున్నారు. గత కొద్దిరోజులుగా ఆ ఫ్యాక్టరీ ఉత్పత్తులకు సంబంధించి ముడుసరుకుల రవాణాను ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదినారాయణ రెడ్డి ఈ విషయంపై స్పందించారు. తనది తప్పని తేలితే రాజకీయాలనుంచి వైదొలుగుతానని స్పష్టం చేశారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. అయితే ఆ కంపెనీలో స్థానికులకు అవకాశం ఇవ్వాలని ఆదినారాయణ రెడ్డి కోరుతున్నారు. అయితే ఇప్పటికే కంపెనీలో కాంట్రాక్ట్ పనులకు సంబంధించి గడువు ఉంది. కానీ దానితో సంబంధం లేకుండా తన వర్గీయులకు పనులు కేటాయించాల్సిందేనని ఆయన తేల్చి చెబుతున్నారు. సంబంధిత యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఆదినారాయణ రెడ్డి వర్గీయులు ఫ్యాక్టరీ ఉత్పత్తులు, ముడి సరుకుల రవాణాను అడ్డుకుంటున్నారన్నది ఒక ప్రచారం. ఇదే విషయంపై సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో పాటు మీడియాకు సమాచారం ఇచ్చింది. అలా వెలుగులోకి వచ్చింది ఆ వివాదం. దీనిపై ఆదినారాయణ రెడ్డి స్పందిస్తూ త్వరలో చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.కొద్ది రోజులుగా ఆదినారాయణ రెడ్డివ్యవహారం కూటమికి తలనొప్పిగా మారింది. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఫ్యాక్టరీల యాజమాన్యాలపై జులుం ప్రదర్శిస్తున్నారంటూ ఆదినారాయణ రెడ్డి పై విమర్శలు ఉన్నాయి. సిమెంట్ ఫ్యాక్టరీలకు అవసరమైన ముడుసరుకు సరఫరా కాంట్రాక్టులతో పాటుగా అన్ని రకాల కాంట్రాక్టులు తన వారికే ఇవ్వాలని ఆదినారాయణ రెడ్డి డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే స్థానికుల తరుపున పోరాడుతున్నందునే తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆదినారాయణ రెడ్డి చెబుతున్నారు. తనది తప్పని తేలితే రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ ఆదినారాయణ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల, చిలమకూరులో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యూనిట్లు ఉన్నాయి. ఇది గతంలో ఇండియా సిమెంట్స్ ఆధీనంలో ఉండేవి. గత ఏడాది నుంచి అల్ట్రాటెక్ యాజమాన్యం పరిధిలోకి వెళ్లాయి. అయితే ఈ యూనిట్లకు ఫ్లైయాష్, సున్నపురాయి సరఫరా జరగకుండా ఇటీవల ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఈ ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. వాటిని ఆదినారాయణ రెడ్డి అనుచరులు అడ్డుకోవడం వివాదంగా మారింది. లారీలను నిలిపివేయడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో సంబంధిత యాజమాన్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. మీడియాలో పతాక శీర్షికన కథనాలు రావడంతో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్పందించారు. ఇందులో తన తప్పు లేదని చెప్పుకునే ప్రయత్నం చేశారు.

# డీసీసీబీ ఛైర్మన్ గిరి కోసం ఎందుకంత పోటీ.

కాకినాడ, ఏప్రిల్ 21,ఏటా రూ. 10వేల కోట్ల టర్నోవర్స్.. మూడు జిల్లాలకు సంబంధించి రైతాగం.. 298 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు.. ఇవన్నీ కలిస్తే కాకినాడ జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు.. ఇంతటి ప్రాధాన్యత కలిగిన డీసీసీబీ ఛైర్మన్ పదవి అంటే ఎవరికి కాంక్ష ఉండదు.. అందుకే ఇప్పుడు ఈ పదవికి పోటీ తీవ్రమయ్యింది.. అధ్యక్ష పదవి కోసం హోరాహోరీ మొదలైంది. అయితే ఈ సారి సొసైటీలకు, బ్యాంక్ డైరెక్టర్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలో ఉన్నారని తెలుస్తోండగా ఈ పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ వీడడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులు వేలాది మంది ఉంటారు. వీరి కార్యకలాపాలన్నీ గ్రామాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలతో ముడిపడి ఉండగా వ్యవసాయ రుణాల నుంచి ఇతర అవసరాలన్నీ ప్రాథమిక సహకార సంఘాలే తీరుస్తాయి.. అయితే వీటన్నిటిపైనా కీలకంగా పర్యవేక్షణచేసే డీసీసీబీ ఏటా రూ.10 వేల కోట్ల వరకు టర్నోవర్ సాధిస్తోంది.. ఉమ్మడి తూర్పోగోదావరి జిల్లాలో 298 పీఏసీఎస్‌లు ఉండగా ఇందులో తూర్పుగోదావరి 49, కాకినాడ 72, అత్యధికంగా కోనసీమ జిల్లాలో 166 పీఏసీఎస్‌లు ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి 11 పీఏసీఎస్‌లు ఉండడం ఇందులో కలిసే ఉన్నాయి. వాస్తవానికి డీసీసీబీ ఇంకా మంచి ప్రగతి పథంలో దూసుకుపోవాల్సిన పరిస్థితి ఉండగా అవినీతి ఆరోపణలు, అనేక పెండింగ్ సమస్యలు వెనక్కు లాగే పరిస్థితి కనిపిస్తోంది.. దీర్ఘకాలంగా సభ్యత్వ రుసుంల నుంచి పలు అంశాలు పెండింగ్లో ఉన్నాయి. 2018తర్వాత ఇప్పటివరకు సొసైటీలకు, బ్యాంక్ డైరెక్టర్ పదవులకు ఎన్నికలు జరపలేదు. దీంతో సభ్యత్వ నమోదు పునరుద్ధరణతో పాటు మార్పులు, చేర్పులు, తుది జాబితాల వెల్లడి, ఇలా కనీసం ఏడాది పాటైనా బ్యాంక్, సొసైటీల ఎన్నికలకు సమయం కావాలి. దీంతో మరోసారి సొసైటీలు, బ్యాంక్ పాలకవర్గాలను నామినేటెట్ విధానంలోనే నియమించక తప్పని పరిస్థితి ప్రభుత్వానికేర్పడింది. దీన్ని గుర్తించి రాష్ట్రంలో అతిపెద్దదైన ఉమ్మడి తూర్పు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్ష పదవితో పాటు డైరెక్టర్ల పదవుల కోసం మూడు పార్టీల్లో హేమాహేమీలంతా ప్రయత్నాలు ప్రారంభించారు.జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ కోసం ఎందుకంత పోటీ అనే అంశంపై అనేక విమర్శలు ఎదురవుతున్నాయి.. ఈ పదవి పొందేందుకు ఎందకంత పోటీ అంటే గతంలో అవినీతికి పాల్పడ్డవారు కోట్లకు పడగలెత్తారన్న ఆరోపణలున్నాయి.. ఈ పదవి చేసిన వారిలో అత్యధికులు దోపిడీదార్లుగా ముద్రపడ్డారు. ఆకాశం శ్రీరామచంద్రమూర్తి, శిరంగు కుక్కుటేశ్వరరావు వంటి ముగ్గురు నలుగురు తప్ప గతకొంతకాలంగా వరుసగా ఈ పదవిని అధిష్టిస్తున్న ప్రతి ఒక్కరు వందల కోట్ల కుంభకోణాల్లో ఇరుక్కున్నారు. వరుపుల సుబ్బారావు హయాంలో శక్తి గ్యాస్ అంటూ బ్యాంక్ను పక్కదారి పట్టించారు. పంతం గాంధీమోహన్ హాయంలో వంద ల కోట్ల ఆరోపణలొచ్చాయి.ఇక వరుపుల రాజా అయితే లెక్కలేని కుంభకోణాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఆయన ప్రాతినిధ్యం వహించిన లంపకలోవ సొసైటీలో భారీ ఆర్థిక కుంభకోణాలున్నట్లు విచారణాధికారి తేల్చేశారు. ఈ ఆర్థికనేరాల ఒత్తిళ్ళ కారణంగానే రాజా ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఇప్పటికే ఈ బ్యాంక్ చైర్మన్ పదవి అంటే వందల కోట్ల దోపిడీకి జాతీయ రహదారిగా రాజకీయాల్లో పేరుపడింది. ఈదశలో గతంలో ఆరోపణలెదుర్కొన్న వ్యక్తులకే ఈ పదవి కట్టబెట్టాలన్న ఆలోచన విమర్శలకు తావిస్తోంది. పలువురు ఎమ్మెల్యేల సిఫార్సుపొందిన పిల్లి సత్తిబాబుపై గతంలో తీవ్రమైన ఆర్థిక ఆరోపణలొచ్చాయి. కాకినాడ డీసీసీబీ ఛైర్మన్ గిరీ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పోటాపోటీగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లా స్థాయి పదవి కావడంతో పాటు ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన చైర్మన్ గిరిని తామే దక్కించుకోవాలని తెలుగుదేశం పార్టీ గట్టిపట్టుదలతో ఉంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పలువురు చైర్మన్ గిరి కోసం సిఫార్సులు కూడా ప్రారంభించారు. ఎమ్మెల్యే టికెట్ పొందలేక పోయిన కొందరు సీనియర్లు తమకీ పదవివ్వాలంటూ అధిష్టానాన్ని అభ్యర్థిస్తున్నారు. తమకు తెలిసిన మంత్రుల ద్వారా చంద్రబాబుకు చెప్పిస్తున్నారు. ఇదిలా ఉంటే జనసేన జిల్లా సహకార బ్యాంక్ ను తమ అధీనంలోకి తెచ్చుకోవాలన్న పట్టుదల ప్రదర్శిస్తోంది.. ఆ పార్టీ కాకినాడ జిల్లాలో ఆధిపత్యంలోనే కొనసాగుతోంది. పిఠాపురం, కాకినాడ రూరల్‌తోపాటు కాకినాడ పార్లమెంటు స్థానంలో పట్టునిలుపుకున్న జనసేన ఇప్పుడు అధినేత పవన్ కళ్యాణ్ చొరవ ద్వారా డీసీసీబీ పీఠం దక్కించుకునేందుకు పావులు కదుపుతోంది.కోనసీమ జిల్లాలో అత్యధికంగా పీఏసీఎస్‌లు ఉండడం వల్ల కోనసీమ ప్రాంతానికి చెందిన మెట్ల రమణబాబు కూడా రేసులో ఉన్నారు. దివంగత మంత్రి మెట్ల సత్యనారాయణ కుమారుడు అయిన రమణబాబు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు.. దివంగత మెట్ల సత్యనారాయణ ఎన్టీఆర్, చంద్రబాబుల హయాంలో పని చేశారు. ఆయన మరణానంతరం కుమారుడు రమణబాబు కోనసీమ టిడిపిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే ఆయనకిప్పటివరకు సరైన గుర్తింపు లభించలేదు. ఇదిలా ఉంటే డిసిసిబి చైర్మన్ కోసం కాపులు, శెట్టిబలిజల మధ్య పోటీ నెలకొంది. గతంలో వరుసగా కాపులే ఈ పీఠాన్ని అధిష్ఠించారు. కాంగ్రెస్, టిడిపి, వైకాపా హయాంలో కాపులకే చైర్మన్ దక్కడం ఇప్పుడు రెండు కులాల మధ్య పోరుగా మారింది..

# పెద్దిరెడ్డికి టీడీపీ నేతల అండలు...?

తిరుపతి, ఏప్రిల్ 21,ఏంటో వీళ్లు పట్టించుకోవడం లేదా.. లేక చేతకావడం లేదా.. లేక క్యాష్ కొట్టినోడిని క్షమించేస్తున్నారా.. ఇదే కూటమి ప్రభుత్వంపై ఆ పార్టీల కార్యకర్తలే విసురుతున్న మాటలు. మొదటి ఆరు నెలలు అయితే ఏకిపారేశారు. తర్వాత కాస్త కేసులు ఒక్కోరిపై పెడుతున్న కొద్దీ .. కొంచెం కొంచెం చల్లబడ్డారు. కాని ఆ కేసులు నడుస్తున్న తీరు చూసి మళ్లీ ఫైరవుతున్నారు. అదేమంటే టీడీపీ నేతలేమో మేం పద్ధతిగా వెళుతున్నాం.. వైసీపీలాగా అరాచకంగా, కక్షగట్టి చేయం అంటూ సుభాషితాలు చెబుతున్నారు. లేటెస్టుగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వ్యవహారంలో ప్రభుత్వంపై ఇలాంటి విమర్శలే వస్తున్నాయి. హైకోర్టు ముందస్తు బెయిల్ ఇస్తే.. సుప్రీంకోర్టులో కేవియెట్ ఎందుకు వేయలేదని.. అసలు బెయిల్ ఇచ్చే సమయంలో ప్రభుత్వం తరపు లాయర్ సరిగా వ్యవహరించలేదని.. సోషల్ మీడియాలో కూటమి కార్యకర్తల మధ్యే పెద్ద వార్ నడుస్తుంది. సమర్థించుకునేవారు కొందరు.. ప్రశ్నించేవారు మరికొందరు.. మొత్తం మీద రచ్చ నడుస్తోంది. ఇప్పుడు మిథున్ రెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు హాజరవుతున్నారు. తన విచారణను లాయర్ల సమక్షంలో చేయాలని.. వీడియో రికార్డింగ్ చేయించాలని హైకోర్టులో పిటిషన్ వేశారు మిథున్ రెడ్డి. దీనిపై కూడా ప్రభుత్వం తరపు లాయర్లు సరిగా వాదించలేదనేదే విమర్శ. అసలు పెద్దిరెడ్డి ఫ్యామిలీతో కుమ్మక్కయ్యారా అంటూ సోషల్ మీడియాలో సర్క్యులేషన్ నడుస్తోంది.ఇక్కడ సమస్య ఏంటంటే? కేసులు ఎదుర్కొంటున్న వైసీపీ పార్టీ నేతలంతా క్యాష్ పార్టీలే. మామూలు క్యాష్ పార్టీలు కాదు? ఎవరిని కొట్టాలన్నా క్యాష్ తోనే కొట్టే బ్యాచ్. క్యాష్ కొడితే దెబ్బ తగిలినా నవ్వుతూ తీసుకునే బాపతు మన వ్యవస్థలో చాలా ఎక్కువ మంది ఉన్నారు. పోలీసులు, లాయర్లు, అధికారులు.. అన్ని చోట్లా ఈ కల్చర్ ఉంది. బోరుగడ్డ అనిల్ విషయంలో అదే జరిగింది. పోలీసులు డబ్బులు తీసుకుని వాడికి రాచమర్యాదలు చేశారు.. ఆ వీడియోలు బయటకు రావడంతో జాగ్రత్తపడ్డారు. ఆఖరికి బోరుగడ్డ బెయిల్ కోసం పెట్టిన పేపర్లు కూడా ఫేక్ అని హైకోర్టు తేల్చింది కాని.. పోలీసులు కాదు.అంతెందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై భూకబ్జా ఆరోపణలు ఎన్ని వచ్చాయి? అటవీ భూములు, అసైన్డ్ భూములు ఆక్రమించినట్లు కంప్లయింట్లు చాలామంది చేశారు. మదనపల్లి తహశీల్దార్ ఆఫీసులో అగ్ని ప్రమాదం జరిగితే హెలికాప్టర్ లో అధికారులను పంపిన ప్రభుత్వం.. తర్వాత మాత్రం దాని గురించి పెద్దగా పట్టించుకున్నది. నెలల తర్వాత పెద్దిరెడ్డికి నోటీసులు ఇవ్వడానికి వెళ్లారు.. ఆయన లేరని వెనక్కి వచ్చేశారు. అలా నడుస్తోంది వ్యవహారం. అసలు భూములు ఆ రేంజులో కొట్టేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని.. అది కూడా ఆయన భార్య పేరు మీద డాక్యుమెంట్లు దొరికాక కూడా .. ఆయనను టచ్ చేయకపోవడం ఎలాంటి సిగ్నల్స్ ఇస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారుపెద్దిరెడ్డి కుటుంబం వరకు టీడీపీలోనే ఓ పెద్ద ఫ్రెండ్ ఉన్నాడన్నది చాలామందికి తెలుసు. ఆయనో టీడీపీ అనుకూల మీడియా అధినేత. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆయన చానెల్ లో పెద్దిరెడ్డిపై ఈగ వాలనివ్వలేదు. ఇక కూటమి వచ్చాక ఆయనను కాపాడే లాబీయింగ్ నడిపించారని ప్రచారం జరుగుతోంది. అయితే మరో పెద్ద టీడీపీ అనుకూల మీడియా ఈ విషయం తెలిసి? పెద్దిరెడ్డిని టార్గెట్ చేసి వార్తలు వరుసగా ఇచ్చింది. దీంతో అందరూ అది ఇవ్వక తప్పలేదు.. ప్రభుత్వం, అధికారులు స్పందించక తప్పలేదు. కాని పెద్దిరెడ్డి ఫ్రెండ్ లాబీయింగ్ గట్టిగానే పని చేస్తున్నట్లు ఉంది. అందుకే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టచ్ చేయడం ఇంకా లేటు అవుతుంది.ఎందుకంటే ఈ స్కామ్ లో జగన్ ను అరెస్ట్ చేయడమే కూటమి ప్రభుత్వ టార్గెట్. అందుకే అలా జరుగుతోంది. లేదంటే మిథున్ రెడ్డిని కూడా పెద్దాయన రామచంద్రారెడ్డి కోరిక మేరకు వదిలేసేవారేమో. ఏమైనా క్యాష్ కొడితే ఎలాంటివాడినైనా వదిలేస్తారు అనే నానుడి మాత్రం కూటమి ప్రభుత్వంలో గట్టిగా వినిపిస్తోంది. కాకపోతే క్రిమినల్ కేసులు మాత్రమే దానికి మినహాయింపు. అందులోనూ కొందరు నేతలకు మాత్రమే ఆ మినహాయింపు. మరి తప్పు చేసిన వైసీపీ నేతలకు శిక్షలు వేయించి తన ప్రాతివత్యం టీడీపీ నిరూపించుకుంటుందో లేదో చూడాలి మరి

# చెట్టును డీ కొన్న కారు..

# ఒకరు మృతి, ఆరుగురుకి గాయాలు



చిత్తూరు చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఘటన రామకుప్పం మండలం జల్ది గాని పల్లె సమీపంలో జరిగింది. సోమవారం తెల్లవారి జామున మదనపల్లి వాసులు విహారయాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడమే కారణంగా గుర్తించారు. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఆరుగురిని 108 లో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రామకుప్పం ఎస్సై మోహన్ ప్రమాద ఘటనపై విచారిస్తున్నారు.

# జార్ఖండ్ లో మరో భారీ ఎన్ కౌంటర్



హైదరాబాద్ జార్ఖండ్ రాష్ట్రంలో మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. పోలీసుల కాల్పుల్లో ఆరుగులు మావో యిస్టులు మృతి చెందారు. భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు కొన సాగాయి. ఘటనా స్థలంలో పోలీసులు భారీ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.ఆటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు మవోయి స్టులు ఎదురుపడటంతో కాల్పులు జరిపినట్లు తెలిపారు. బొకారో జిల్లాలో సీఆర్పిపిఎఫ్ కోబ్రా కమాండోలతో జరిగిన ఎన్కౌంటర్లో ఆరుగురు నక్సలైట్లు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. లాల్పానియా ప్రాంతంలోని లుగు హిల్స్ ప్రాంతంలో ఈ కాల్పులు జరిగాయి.209 కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ కోబ్రా దళాలు ఈ ఆపరేషన్ నిర్వహించాయి, ఇందులో ఆరుగురు మావోయిస్టులు మరణించినట్లు పోలీస్ అధికార వర్గాలు తెలిపాయి.

# ఇండియాకు అమెరికా వైస్ ప్రెసిడెంట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) తెలుగింటి అల్లుడు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స కుటుంబ సమేతంగా నాలుగు రోజుల పాటు భారతదేశంలో పర్యటించనున్నారు. అమెరికా ఉపాధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జేడి వాన్స్.. తొలి భారత పర్యటనకు రానున్నారు. జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్, భారత సంతతికి చెందిన మొదటి అమెరికన్ సెకండ్ లేడీ కావడం విశేషం.భారత పర్యటనలో భాగంగా జేడి వాన్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై, భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు, ఆర్థిక, వాణిజ్య ఒప్పందాలు, భౌగోళిక రాజకీయ అంశాలు, ఇండో-పసిఫిక్ భద్రత, ఎఐ, డ్రోన్ టెక్నాలజీలపై చర్చలు జరపనున్నారు. భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో కీలకమైనదిగా జేడి వాన్స్ భారత్ పర్యటనను భావిస్తున్నారు. వాణిజ్య ఒప్పందాలు, టారీఫ్‌లు, భౌగోళిక రాజకీయ అంశాలపై జరిగే చర్చలు రెండు దేశాల భవిష్యత్తు సహకారానికి దిశానిర్దేశం చేయనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.అమెరికా ఉపాధ్యక్షుడు జేడి వాన్స్ తన భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలు (ఇవాన్, వివేక్, మిరాబెల్)తో కలిసి నాలుగు రోజుల భారత పర్యటనకు రానున్నారు. ప్రధానమంత్రి నివాసంలో నరేంద్ర మోదీతో వాన్స్ సమావేశమవుతారు. ఇద్దరి మధ్య కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశంలో 2030 నాటికి భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరగనున్నాయి. అమెరికా విధించిన టారీఫ్‌ల వ్యవహారంపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. అనంతరం వాన్స్ కుటుంబానికి విందు ఇవ్వనున్నారు ప్రధాని మోదీ.భారత పర్యటనలో జేడీ వాన్స్ కుటుంబం ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించనుంది. ఏప్రిల్ 21న ఢిల్లీలోని అక్షర్‌ధామ్ స్వామి నారాయణ్ ఆలయం, స్థానిక మార్కెట్‌లనుసందర్శించనున్నారు. ఏప్రిల్ 22న రాజస్థాన్‌లోని జైపూర్‌లో అంబర్ ఫోర్ట్, హవా మహల్ వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించనున్నారు. ఏప్రిల్ 23న ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించనున్నారు. ఏప్రిల్ 24న ఉదయం 6:40 గంటలకు ఢిల్లీ నుండి అమెరికాకు తిరిగి ప్రయాణం కానున్నారు. మోదీ విందు తర్వాత, వాన్స్, అతని కుటుంబం జైపూర్‌కు బయలుదేరుతారు. జైపూర్‌లో రాంబాగ్ ప్యాలెస్ హెరిటేజ్ హోటల్‌లో బస చేయనుంది వాన్స్ కుటుంబం. మంగళవారం జైపూర్ లో వివిధ చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తారు. జఔఇఖాఅూ ప్రపంచ వారసత్వ ప్రదేశంగా పిలువబడే అంబర్ ఫోర్ట్, హవా మహల్‌ను సందర్శిస్తారు. రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో మధ్యాహ్నం జరిగే సభలో జేడి వాన్స్ ప్రసంగిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో దౌత్యవేత్తలు, విదేశాంగ విధాన నిపుణులు, భారత ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొనే అవకాశం ఉంది. ట్రంప్ పరిపాలనలో భారత్-అమెరికా సంబంధాలపై ఆయన మాట్లాడే అవకాశం ఉంది.జైపూర్‌లో ఒక రోజు పర్యటన తర్వాత, వాన్స్ కుటుంబం బుధవారం ఆగ్రా తాజ్ మహల్ ను సందర్శిస్తారు. భారతీయ హస్తకళలు, కళాఖండాల ప్రదర్శనకు ప్రసిద్ధి చెందిన ఓపెన్-ఎయిర్ ఎంపోరియం అయిన శిల్పగ్రామ్‌ను కూడా పర్యటిస్తారు. అనంతరం తిరిగి జైపూర్ చేరుకుంటారు. ఏప్రిల్ 24న ఉదయం భారత్ పర్యటన ముగించుకుని అమెరికా బయలుదేరుతారు.భారత్ పర్యటనలో భాగంగా జేడీ వాన్స్ సతీమణి ఉషా వాన్స్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించే అంశంపై క్లారిటీ లేదు. ఇప్పటి వరకు ఉన్న షెడ్యూల్ ప్రకారం వాన్స్ కుటుంబం ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రమే పర్యటించే అవకాశం ఉంది. ఉషా వాన్స్ (ఉషా బాల చిలుకూరి వాన్స్), మొట్టమొదటి ఆసియా అమెరికన్, హిందూ అమెరికన్ ద్వితీయ మహిళగా చరిత్ర సృష్టించారు. ఉషా కాలిఫోర్నియాలోని శాన్ డియాగోలో తెలుగు భారతీయ వలస కుటుంబంలో జన్మించారు.ఉషా తల్లిదండ్రులు క్రిష్ చిలుకూరి, లక్ష్మి చిలుకూరి, ఇద్దరూ ప్రొఫెసర్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. ఆమె పూర్వీకులు కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం సాయిపురం తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన వారు. ఉషా వృత్తి పరంగా న్యాయవాది. ఉషా, జేడీ వాన్స్ యేల్ లా స్కూల్‌లో కలుసుకున్నారు. 2014లో కెంటకీలో హిందూ సంప్రదాయంలో మతాంతర వివాహం చేసుకున్నారు. జేడీ వాన్స్ క్రిస్టియన్ మతాన్ని అనుసరిస్తారు, అయితే ఉషా హిందూ మతాన్ని గౌరవిస్తారు. జేడి ఉషా దంపతులకు ముగ్గురు పిల్లలు. ఇవాన్, వివేక్, మిరాబెల్. 2024 అమెరికా ఎన్నికల్లో ఉషా జేడి వాన్స్ రాజకీయ ప్రచారంలో కీలక పాత్ర పోషించారు.

# టార్గెట్ సౌత్ సాధ్యమేనా

కేంద్రంలో వరుసగా మూడు పర్యాయాలు అధికారంలోకి వచ్చి, దేశవ్యాప్తంగా తిరుగులేని విజయాలు సాధిస్తున్న బలమైన భారతీయ జనతా పార్టీ కి రాజకీయంగా దక్షిణ భారతంలో ఆశించిన స్థాయిలో పట్టు చిక్కడం లేదు. దానికి ఒక దశాబ్దంగా ఈ పార్టీ వేస్తున్న ఎత్తుగడలు, చేస్తున్న ప్రయోగాలు ఫలప్రదం కావడం లేదు. 129 లోక్‌సభ స్థానాలు ఉన్న దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలలో బీజేపీ 29 లోక్ సభ స్థానాలకు మించి గెలవలేక పోయింది.లోకసభ ఎన్నికల సందర్భంగా మిషన్ దక్షిణాది వ్యూహంలో భాగంగా 50కి పైగా లోక్‌సభ స్థానాలలో విజయం సాధించాలనే బీజేపీ ఆశలు నెరవేరక పోగా కేరళ, తమిళనాడులలో ఎన్ని ప్రయోగాలు చేసినా ఖాతానే తెరవలేదు. బలం ఉన్న కర్ణాటకలో గతం కంటే ఎనిమిది లోక్‌సభ స్థానా లు తగ్గితే, పొత్తులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో మూడు లోక్‌సభ స్థానాలలో గెలువగ లిగిందిఒక్క తెలంగాణలోనే గతం కంటే రెట్టింపు సంఖ్యలో 8 లోక్‌సభ స్థానాలలో విజయం సాధించి, పరువు కాపాడు కోగలిగింది. నిధుల కేటాయింపులో మోదీ ప్రభుత్వం దక్షిణాదిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని, లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది ప్రాబల్యం దెబ్బ తీయాలని చూస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి.గత లోక్‌సభ ఎన్నికలలో సొంత బలంతో దక్షిణాదిలో ఎదగాలనే రాజకీయ వ్యూహం ఫలించలేదు. దీంతో దక్షిణాదిలో రాజకీయంగా బలపడటానికి, కాంగ్రెస్ దాని మిత్రపక్షాలను బలహీన పరచటానికి బీజేపీ తన రాజకీయ వ్యూహాలను మార్చుకుంటున్నట్లుగా కనిపిస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో జనసేన, తెలుగుదేశం పార్టీలతో చివరి నిమిషంలో, కర్ణాటకలో జేడీఎస్ తోనూ పొత్తు పెట్టుకోవటం బీజేపీకి రాజకీయంగా కలిసి వచ్చింది. కాబట్టి, దక్షణ భార తంపై రాజకీయంగా పట్టు సాధించాలన్నా, కాంగ్రెస్ దాని బలమైన మిత్రపక్షం డీఎంకేని బలహీన పరచాలన్నా 39 లోక్‌సభ స్థానా లు ఉన్న పెద్ద రాష్ట్రమైన తమిళనాడుపై పట్టు సాధించాల్సి ఉంటుంది.వ్యూహం లో భాగంగానే తన పాత మిత్రపక్షమైన అన్నా డీఎంకేతో మరొకసారి భారతీయ జనతా పార్టీ పొత్తుకి సిద్ధమైంది. ఇది రాజకీయ వర్గాలను ఆశ్చర్య పరిచిందనే చెప్పాలి. ద్రవిడ పార్టీల సహకారం లేకుండా తమిళనాడుపై పట్టు సాధించలేమని గత లోక్‌సభ ఎన్నికలు నిరూపించాయి. ఈ నేపథ్యంలో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్, వీసీకే, ఐయుఎంఎల్, వామపక్ష పార్టీల కూటమిని ఎదుర్కొని పాగా వేయాలంటే అన్నా డీఎంకేతో పొత్తు అనివార్యమని భావించారు.మేరకు అమిత్ షా తన రాజకీయ వ్యూహాలలో భాగంగా అనూహ్య నిర్ణయం తీసుకున్నారనే చెప్పాలి. 2026లో తమిళనాడులో జరగనున్న శాసనసభ ఎన్నికలలో డీఎంకేని ఓడించడం ద్వారా 2029 లోక్‌సభ ఎన్నికలలో తమిళనాడులో పట్టు సాధించాలనేది ఆ పార్టీ వ్యూహం వలె ఉన్నది. గత లోక్‌సభ ఎన్నికలలో 8 చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకుని అన్నామలై లాంటి యంగ్ లీడర్‌తో పోరాటం చేసినా ఒక్క లోక్‌సభ స్థానాన్ని కూడా గెలువలేక పోయింది.లోక్‌సభలో ఐదవ అతిపెద్ద పార్టీగా ఉన్న డీఎంకేని, దక్షిణాది నుంచి కేంద్ర ప్రభుత్వం కంట్లో నలుసుగా మారిన ఎంకే స్టాలిన్‌ని దెబ్బ తీయటానికి షా రూ పొందించిన మంత్రాంగంగా పై పొత్తును భావిస్తున్నారు. జయలలిత మరణం తర్వాత అనేక సవాళ్లను ఎదుర్కొని మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి తమిళనాడులో అన్నా డీఎంకేని బలమైన పార్టీగా నిలుపగలిగారు.2024 లోక్‌సభ ఎన్నికలలో ఆ పార్టీ ఒంటరిగా 23 శాతం ఓట్లను సాధించింది కనుకే అన్నా డీఎంకే, బీజేపీ జత కడితే రెండు పార్టీల బలం 41 శాతం అవుతుంది. ఈ రకంగా డీఎంకే కూటమికి బలమైన ప్రత్యర్థిగా నిలబడవచ్చన్నది షా అంచనా. పన్నీరు సెల్వం, దినకరన్ లాంటి వాళ్ళని కూడా తమవైపుకు తిప్పుకొని డీఎంకేకి గట్టి పోటీ ఇవ్వాలనేది ఆయన వ్యూహంగా కనిపిస్తుంది.మరొకవైపు సినీ హీరో విజయ్ పార్టీ టీవీకే చీల్చే ఓట్లుకూడా తమిళనాడు రాజకీయాలను ప్రభావితం చేయబోతున్నాయి. తమిళనాడులో షా ఎత్తుగడతో డీఎంకే, కాంగ్రెస్‌లు కొంత ఆత్మరక్షణలో పడినట్లుగానే కనిపిస్తున్నది. కర్ణాటకలో జేడీ(ఎస్)తో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేనలతో, తమిళనాడులో అన్నా డీఎంకేతో ఆయా రాష్ట్రాలలో పాగా వేసి, ప్రత్యర్థి పార్టీల దూకుడుకు కళ్లెం వెయ్యడమే బీజేపీ 'ప్లాన్‌బి'గా కనిపిస్తున్నది. దక్షిణాదిలో బలం పెంచుకోవడానికి ఇక్కడి రాష్ట్రాల నుంచి బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్నది ఆ పార్టీ వేస్తున్న మరొక ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలోనూ తమిళనాడు నుంచి జానా కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ నుంచి వెంకయ్య నాయుడు, తెలంగాణ నుంచి బంగారు లక్ష్మణ్ లాంటి వారు బీజేపీ జాతీయ అధ్యక్షులుగా పని చేశారు.తమిళనాడు నుంచి అన్నామలై, తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి పురంధరేశ్వరి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి రేసులో వినపడుతున్న పేర్లు. ఆ పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారిని ఎంపిక చేయటం ద్వారా తమది ఉత్తరాది పార్టీ మాత్రమే కాదు,దక్షిణాదికి కూడా ప్రాధాన్యం ఇస్తుందనే సంకేతం ప్రజలలోకి పంపాలనేది పార్టీ వ్యూహం అంతరార్థంగా కనిపిస్తున్నది. రాబోయే లోక్‌సభ ఎన్నికల నాటికి దక్షిణాదిలో బలపడటానికి ఏ ఒక్క చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవడానికి భారతీయ జనతా పార్టీ ఇష్టపడటం లేదు. దేశంలో ఇప్పటికే బీజేపీ 16 రాష్ట్రాలలో, దాని మిత్రపక్షాలు ఆరు రాష్ట్రాలలో అధికారంలో ఉన్నాయి. 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో పార్టీ కొంత బలహీన పడినట్లుగా కనిపించినా లోక్‌సభ ఎన్నికల అనంతరం ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు జరిగితే, ఇప్పటికే అధికారంలో ఉన్న హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలలోనూ దానిని నిలబెట్టుకోవచ్చు. ఇండియా కూటమిలోని ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించి 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారాన్ని సొంతం చేసుకోవడం ద్వారా మరోసారి బీజేపీ తన బలాన్ని నిరూపించుకుంది. మొత్తం మీద బీజేపీ చాపకింద నీరులా ఒక్కొక్క రాష్ట్రాన్ని తన ఖాతాలో వేసుకుంటున్నది. 2025 చివరిలో జరిగే బీహార్ శాసనసభ ఎన్ని కలలోనూ, 2026లో జరిగే పశ్చిమ బెంగాల్, తమిళనాడు శాసనసభ ఎన్నికలలోనూ గెలువడానికి బీజేపీ బలమైన వ్యూహాలనే సిద్ధం చేసుకుంటుంది.121 లోక్‌సభ స్థానాలు గల ఈ మూడు పెద్ద రాష్ట్రాలలో గెలుపు సాధిస్తే (18వ లోక్‌సభ ఎన్నికలలో ఈ మూడు రాష్ట్రాల నుంచి పార్టీ గెలిచిన లోక్‌సభ స్థానాలు కేవలం 42 మాత్రమే) దేశంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగే అవకాశాలు ఉంటాయి. బీజేపీకి కలిసి వచ్చే అంశం ఆ పార్టీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాలలో దాని బలం చెక్కు చెదరటం లేదు.ఇదే సమయంలో విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో వాటి పూర్వపు బలాన్ని కోల్పోతున్నాయి. మరొక వైపు దేశంలో ఏ ఒక్క రాష్ట్రంలో కూడా (తెలంగాణ మినహాయిస్తే) కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకోలేక పోతున్నది. ఇది కూడా ఒకింత బీజేపీకి రాజకీయంగా కలిసివస్తున్నది. తమిళనాడులో స్టాలిన్, పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ, బీహార్‌లో తేజస్వి యాదవ్, ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్‌లే బీజేపీని కొంత ప్రతిఘటిస్తున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో బీజేపీ రాజకీయ వ్యూహాలు ఫలిస్తే పార్టీ దేశంలో మరింత బలపడుతుంది. తమిళనాడులో ఆ పార్టీ అన్నా డీఎంకేతో పొత్తు ఆంధ్రప్రదేశ్‌లో లాగా విజయవంతమైతే దక్షిణాదిలో బీజేపీకి మరింత బలం పెరుగుతుంది.దక్షిణాదిలో కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో పార్టీ రాజకీయ ఎత్తుగడలు ఫలిస్తే ఈ మొత్తం ప్రాంతంపై దానికి పట్టు చిక్కినట్లే అనుకోవాలి. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో షా మంత్రాంగం ఫలించినట్లుగానే తమిళనాడులో కూడా ఫలిస్తుందో లేదో చూడాలి. ఇందుకు తమిళనాడు శాసనసభ ఎన్నికల వరకు వేచి ఉండాల్సిందే.

## ఏకగ్రీవం నిలుపుకుంటారా...

హైదరాబాద్, ఏప్రిల్ 21,హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీలో 22ఏళ్లుగా మజ్లిస్ పార్టీ ఏఐఎంఐఎం పార్టీకే ఏకగ్రీవం. కానీ ఇప్పుడలా కుదరదంటూ బరిలోకి దిగింది భారతీయ జనతా పార్టీ. పాతబస్తీపై పట్టున్న మజ్లీస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నిలబడింది. దీంతో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ రసవత్తరంగా మారింది. దాదారు 22 ఏళ్ల తర్వాత ఏప్రిల్ 23వ తేదీన ఎన్నిక జరగనుంది.హైదరాబాద్ జిల్లా పరిధిలో జరిగే లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో బలాబలాలను పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబట్టలేదు. మెజారిటీ మెంబర్స్ ఉన్న ఎంఐఎం అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం అనుకున్న తరుణంలో సెకెండ్ హయ్యేస్ట్ మెజారిటీ ఉన్న బీజేపీ బరిలో దిగడంతో ఎన్నికల ఓటింగ్ అనివార్యమైంది. ఎంఐఎం తరపున మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ తరపున గౌతమ్ రావు అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.ఈ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు మొత్తం 112 ఓట్లు ఉండగా.. అందులో 81 మంది కార్పోరేటర్లు, 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మజ్లిస్ పార్టీకి 40 మంది కార్పోరేటర్లు, 9 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో 49 ఓట్ల బలం ఉంది. బీజేపీకి 19 మంది కార్పోరేటర్లు 6 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 25 మంది , బీఆర్ఎస్ కు 15+9 కలిపి 24. కాంగ్రెస్ 7+7 తో 14 సభ్యుల సంఖ్యాబలం ఉన్నాయి. ఎక్స్ అఫీషియో సభ్యుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇప్పటికే పోలింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, ఎంఐఎంకు మద్ధతు తెలుపుతుందని ఆ పార్టీ ఆశాభావంతో ఉంది. నామినేషన్ నాడే తమ గెలుపు లాంఛనం అంటూ ఎంఐఎం అభ్యర్థి ధీమా వ్యక్తం చేశారు.గెలుపు కోసం కావాల్సిన సరైన సంఖ్యాబలం లేకున్నా.. బల్దియాపై పట్టు బిగించేందు కాషాయనేతలు పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు కాంగ్రెస్, బీఆర్ఎస్ జట్టుగా ఎంఐఎంకు సహకరిస్తున్నాయని ప్రజలకు ప్రూవ్ చేయడం తమ లక్ష్యమని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు హైదరాబాద్ మహానగరంలో ఎంఐఎం ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు బీజేపీ గెలుపును కోరుకుంటున్నారని, అందుకనుగుణంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పోరేటర్లు కూడా తమకు ఓటేస్తారని బీజేపీ అభ్యర్థి గౌతం రావు అంటున్నారు. జాతీయ వాదానికి, జాతీ విద్రోహులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో డెఫినెట్ గా ఆయా పార్టీలను కాదని కార్పొరేటర్లు తనకు ఓటేస్తారని గౌతమ్ రావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ఏ ఎవైనా గెలుపోటములు లెక్కచేయకుండా పోటీ చేసే పార్టీ బీజేపీ అని.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆయన అన్నారు.హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కమలనాథులు.. గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ నాటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఝలక్ ఇచ్చేలా తమకు ఉన్న 25 ఓట్ల కంటే అదనంగా ఓట్లు సాధిస్తామని అంటున్నారు. మరోవైపు ఇతర పార్టీల కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలతో మాట్లాడి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ పార్టీలోకి వస్తామన్న కార్పొరేటర్లకు పొలిటికల్ కేరీర్ గ్యారంటీ కూడా ఇస్తున్నట్లు సమాచారం. దీంతో చివరి క్షణం వరకు బీజేపీ ప్లాన్ ఎంతమేరకు వర్క్ అవుట్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గాలిపటం విజయబావుట ఎగురవేస్తుందా.. లేక నిజంగానే ఏదైనా మిరాకిల్ జరిగి కమలం వికసిస్తుందా వేచి చూడాలి..!

## గూగుల్ లోనూ.. లే ఆఫ్స్, టార్గెట్

హైదరాబాద్, ఏప్రిల్ 21, టెక్ దిగ్గజం గూగుల్ భారతదేశంలో ఉద్యోగుల తొలగింపు (లేఆఫ్స్) ప్రక్రియకు సిద్ధమవుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ప్రధానంగా ప్రకటనలు, సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ఈ ప్రభావాన్ని ఎదుర్కోనున్నారు. ఈ చర్యలు కంపెనీ యొక్క ప్రపంచవ్యాప్త పునర్వ్యవస్థీకరణ, నిర్వహణ సామర్థ్యం పెంపొందించే ప్రయత్నాల భాగంగా చూడవచ్చు. అయితే, ఇంజినీరింగ్ ఉద్యోగులకు సంబంధించి గూగుల్ కొంత సానుకూల విధానాన్ని అనుసరించనుంది. ఈ వార్తలు భారత టెక్ రంగంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.గూగుల్ భారతదేశంలోని బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను వచ్చే వారం నుంచి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు బిజినెస్ స్టాండర్డ్‌నివేదిక అంచనా వేసింది. ప్రధానంగా ప్రకటనలు, సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లోని ఉద్యోగులు ఈ లేఆఫ్స్ ప్రభావాన్ని ఎదుర్కొనవచ్చు. గూగుల్ ఈ విషయంపై అధికారికంగా ధ్రువీకరించకపోయినప్పటికీ, కంపెనీ ఇటీవలి పునర్వ్యవస్థీకరణ చర్యలు ఈ నిర్ణయానికి నేపథ్యంగా ఉన్నాయి. గూగుల్ భారతదేశంలో సుమారు 10 వేల మంది ఉద్యోగులను కలిగి ఉందని అంచనా, ఇందులో గణనీయమైన సంఖ్య బెంగళూరు, హైదరాబాద్ కేంద్రాల్లో ఉన్నారు.యొక్క ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్‌విభాగంలో 2024లో జరిగిన పునర్వ్యవస్థీకరణలో భాగంగా, ఆండ్రాయిడ్, పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్ వంటి కీలక ఉత్పత్తులను నిర్వహించే ఈ విభాగం నుంచి ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది ఉద్యోగులు తొలగించబడ్డారు. ఈ విభాగం గూగుల్ ఆర్థిక ఆదాయంలో సింహభాగం సమకూర్చినప్పటికీ, మారుతున్న వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడం, ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా కంపెనీ ఈ చర్యలు చేపట్టింది. 2023లో గూగుల్ ప్రపంచవ్యాప్తంగా 12 వేల మంది ఉద్యోగులను తొలగించిన నేపథ్యంలో, ఈ తాజా లేఆఫ్స్ ఊహాగానాలు ఉద్యోగుల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి.

భారతదేశంలో గూగుల్ ఇంజినీరింగ్ ఉద్యోగుల విషయంలో కొంత సానుకూల విధానాన్ని అనుసరించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌లలో టెక్నికల్ పొజిషన్లలో ఉన్న ఉద్యోగులను నేరుగా తొలగించడానికి బదులుగా, ఆదాయం సమకూర్చే ఇతర ప్రాజెక్టులకు బదిలీ చేసే అవకాశం ఉంది. గూగుల్ ఇండియా ఇంజినీరింగ్ బృందాలు కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ వంటి కీలక రంగాల్లో ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తాయి, ఇవి కంపెనీ యొక్క దీర్ఘకాల వృద్ధికి కేంద్రంగా ఉన్నాయి. ఈ సానుకూల విధానం టెక్ రంగంలో భారత ఉద్యోగుల విలువను సూచిస్తుంది.గూగుల్ గత కొన్ని సంవత్సరాలుగా అంతర్గత నిర్మాణంలో విస్తత మార్పులు చేస్తోంది. 2024లో కంపెనీ తన ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్ బృందాలను విలీనం చేసింది, దీనిలో ఆండ్రాయిడ్, క్రోమ్, పిక్సెల్ హార్డ్‌వేర్ విభాగాలు సమన్వయించబడ్డాయి. ఈ విలీనం తర్వాత, ఉద్యోగుల క్రమబద్ధీకరణలో భాగంగా కొందరిని తొలగించారు. జనవరి 2025లో, గూగుల్ తన ఉద్యోగులకు స్వచ్ఛంద విరమణ (వాలంటరీ సెపరేషన్) పథకాలను ప్రవేశపెట్టినట్లు ధ్రువీకరించింది, ఇందులో సెవరెన్స్ ప్యాకేజీలు, రీలొకేషన్ సపోర్ట్ వంటి ప్రోత్సాహకాలు అందించబడ్డాయి. ఈ చర్యలు కంపెనీ యొక్క ఖర్చు నియంత్రణ, వనరుల సమర్థవంతమైన వినియోగం కోసం ఉద్దేశించినవి.గూగుల్ లేఆఫ్స్ టెక్ రంగంలో కొనసాగుతున్న విస్తృత ట్రెండ్‌లో భాగంగా చూడవచ్చు.

2023?2024లో అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులను తొలగించాయి, ఇది ఆర్థిక మాంద్యం భయాలు, అఐ ఆటోమేషన్, వ్యాపార పునర్వ్యవస్థీకరణలకు ఆపాదించబడింది. భారతదేశం, టెక్ రంగంలో ఒక ప్రధాన కేంద్రంగా, ఈ లేఆఫ్స్ ప్రభావాన్ని తీవ్రంగా అనుభవిస్తోంది.

నాస్కామ్ నివేదిక ప్రకారం, 2024లో భారత ఐటీ రంగంలో 5?7% ఉద్యోగ కోతలు నమోదయ్యాయి, ఇది యువ టెక్ నిపుణులలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలను పెంచింది.గూగుల్ లేఆఫ్స్ నిర్ణయం ఉద్యోగులలో ఒత్తిడిని, అనిశ్చితిని పెంచుతోంది. సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లోని ఉద్యోగులు కొత్త అవకాశాల కోసం వెతకాల్సి రావచ్చు, అయితే ఇంజినీరింగ్ ఉద్యోగులకు అంతర్గత బదిలీలు కొంత ఊరటనిస్తాయి. గూగుల్ యొక్క వ్యూహం అఐ, క్లౌడ్, డిజిటల్ అడ్వర్టైజింగ్ వంటి అధిక?వృద్ధి రంగాలపై దృష్టి సారించడం, ఖర్చు?సామర్థ్య రంగాలను తగ్గించడంపై కేంద్రీకృతమై ఉంది. ఈ చర్యలు కంపెనీ యొక్క ఆర్థిక లాభాలను బలోపేతం చేసినప్పటికీ, ఉద్యోగుల మనోధైర్యంపై, కంపెనీ సంస్కృతిపై ప్రభావం చూపవచ్చు.

## అటకెక్కిన ఫార్ములా కథ

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: ఏప్రిల్ 21,** హైదరాబాద్ ఫార్ములా ఈ కార్ రేస్ కేసు తెలంగాణ రాజకీయల్లో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలను విదేశాలకు తరలించారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ తో పాటు పలువురు ఐఏఎస్ అధికారులపై ఏసీబీ కేసు నమోదు చేసింది.కేటీఆర్ పేరును ఈఎఫ్ఐలో నమోదు చేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తనపై ఏసీబీ నమోదు చేసిన ఈఎఫ్ఐను క్వాష్ చేయాలన్న కేటీఆర్ పిటీషన్ పై విచారణ జరిపిన హైకోర్టు విచారణకు హాజరవ్వాల్సిందేనని తేల్చి చెప్పింది. దీంతో ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. ఇదే వ్యవహారంలో ఈడీ సైతం కేసు నమోదు చేయటంతో ఈడీ ఎదుట విచారణకు కేటీఆర్ హాజరై సమాధానాలిచ్చారు.అయితే మరోసారి తనకు ఏసీబీ, ఈడీ నోటీసులు ఇచ్చేందుకు సిద్దమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కామెంట్స్ చేయడం ఆసక్తిరేపింది. బడ్జెట్ నుంచి అందరి దృష్టిని మరల్చేందుకు ఈ కేసులో తనను అరెస్ట్ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు.బడ్జెట్ సమావేశాలు ఎప్పుడో పూర్తయినా..ఇప్పటి వరకు కేటీఆర్ అనుమానం వ్యక్తం చేసినట్లుగా అలాంటిదేమి జరగలేదు. దీంతో రాష్ట్రంలో సంచలనం రేపిన ఈకార్ రేస్ కేసు ఏమైందంటూ పొలిటికల్ సర్కిల్స్ తో పాటు సామాన్య జనంలోను చర్చ జరుగుతోంది. నెల రోజుల క్రితమే ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు విచారణ తుది దశకు చేరుకుందని చెప్పిన ఏసీబీ అధికారులు ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారనే సందేహాలు తలెత్తుతున్నాయి.అయితే గులాబీ పార్టీలో మాత్రం ఈ-కార్ రేస్ కేసుపై భిన్నమైన చర్చ జరుగుతోందట. ముందు నుంచి కేటీఆర్ చెప్తున్నట్లుగా?ఈ-కార్ రేస్ విషయంలో ఎటువంటి అవకతవకలు జరగలేదని అంటున్నారు. నిబంధనల మేరకే ఈ కార్ రేస్ జరిగిందని,..ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని, పైగా ఈ కార్ రేస్ వల్ల ప్రభుత్వానికే ఆదాయం సమకూరిందని కేటీఆర్ చెబుతూ వస్తున్నారు.ఐతే ఏసీబీ విచారణలో కూడా ఇదే విషయం తేలిందని, అందుకే విచారణ పూర్తైనా ప్రభుత్వం స్పందించడంలేదనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోందట. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలోను ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అవుతారనుకుంటే ఇలా తాత్సారం చేస్తున్నారేంటన్న చర్చ జరుగుతోందట. కానీ ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ ప్రమేయం లేదని ఏసీబీ నిర్ధారణకు రాడవంతోనే సైలెంట్ అయ్యిందన్న చర్చ జరుగుతోంది. ఇక ఈ కేసులో ఈడీ కూడా ఎంటరైంది కాబట్టి..ఏదైనా ఉంటే ఈడీ చూసుకుంటుందిలే అని ప్రభుత్వం లైట్ తీసుకుంటుందన్న టాక్ వినిపిస్తోంది. హైదరాబాద్ ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, అందులో కేటీఆర్ ప్రమేయం ఉందని హడావుడి చేసి, కేటీఆర్ తో పాటు అధికారులను విచారించి..ఇప్పుడు సైలెంట్ గా ఉంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయట. ఈ కేసులో ఏంలేదని, ఇదొక ఒట్టి లొట్టపీసు కేసని కేటీఆర్ చెప్పినట్లే జరిగితే రాజకీయ కక్ష్యతోనే ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతాయన్న ఆందోళన సైతం కాంగ్రెస్ వర్గాల్లో నెలకొందట. అందుకే తొందరపడకుండా ఈ-కార్ రేస్ కేసులో ఈడీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్లు

## సరస్వతి పుష్కరాల కోసం యాప్

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: ఏప్రిల్ 21,**తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సరస్వతి పుష్కరాలు జరగనున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో ఈ ఏడాది మే 15 నుంచి 26 వరకు ఈ పుష్కరాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం సంబంధిత శాఖలను ఆదేశించింది. పుష్కరాల ఏర్పాట్ల కోసం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఇప్పటికే రూ.25 కోట్లు మంజూరు చేసింది. సరస్వతీ నది పుష్కరాలకు లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి పనులను సమర్థవంతంగా చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు.కాగా, తాజాగా సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ దేశంలోని భక్తులందరికీ పుష్కరాలకు చేరుకోవడానికి ఒక సమగ్ర గైడ్‌లా ఉపయోగపడుతుంది. హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ చేతుల మీదుగా ఆవిష్కరించబడిన ఈ యాప్ ఇప్పుడు వినియోగదారులకు అందుబాటులో ఉంది. ఈ యాప్‌లో సాధారణ స్నాన ఘాట్, సరస్వతీ ఘాట్ యొక్క స్థానం, ఆలయానికి చేరుకునే మార్గం, బస్ స్టాండ్ వంటి ప్రయాణ ప్రాంగణాలకు ఎలా వెళ్లాలి, వాహనాలు పార్క్ చేసే ప్రదేశాలు, మరియు వైద్య సహాయ కేంద్రాలు ఎక్కడ ఉన్నాయి అనే వివరాలు పొందుపరచబడ్డాయి.అంతేకాకుండా, అన్నదాన కేంద్రాలు, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, సామాన్లు భద్రపరుచుకునే ప్రదేశాల గురించిన సమాచారాన్ని కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పుష్కరాలకు వచ్చే భక్తులు కాళేశ్వరం సమీపంలోని ఇతర ప్రసిద్ధ దేవాలయాలైన మేడారం, రామప్ప, మరియు లక్నవరం వంటి పర్యాటక ప్రదేశాల వివరాలను కూడా ఈ యాప్‌లో చూడవచ్చు. ఈ విధంగా, ఈ మొబైల్ అప్లికేషన్ పుష్కరాలకు వచ్చే భక్తులకు సమగ్రమైన సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో అందిస్తూ వారి ప్రయాణాన్ని మరింత సులభతరం చేయనుందని అధికారులు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు వేములవాడ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి.

### వేములవాడ మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం గౌడ్ డిమాండ్.






**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** నీతి నిజాయితీకి మారుపేరు అంటూ ప్రగల్భాల్ పలికే చెన్నమనేని కుటుంబానికి మాయని మచ్చగా వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు మారినాడని వేములవాడ మండలం మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం గౌడ్ వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా 30 లక్షల రూపాయల జరిమానాను సోమవారం రోజున చెన్నమనేని తరఫున అతని న్యాయవాదులు అందించడాన్ని స్వాగతించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అత్యున్నతమైనటువంటి భారత పౌరసత్వాన్ని పొంది ఉన్నత పదవులను అనుభవించి, భారత రాజ్యాంగ విలువలను మోసగించారని ఆయన వాపోయారు. ఒక ప్రజా ప్రతినిధిగా నియమితులై నైతిక విలువలు పాటించవలసిన వ్యక్తి ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడటం సిగ్గు చేటని విమర్శించారు. ఇప్పటికైనా చెన్నమనేని రమేష్ బాబు వేములవాడ నియోజకవర్గ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని రంగు వెంకటేశం గౌడ్ డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం పౌరసత్వ వివాదం పై న్యాయపోరాటం చేసి విజయం సాధించిన ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## మద్యానికి బానిసైన వ్యక్తి ఊరు గాని ఊరులో ప్రాణాలు వదిలాడు.

### కోనరావుపేట మండలం మామిడిపల్లి కి చెందిన తీపి రెడ్డి సుదర్శన్ రెడ్డి గా గుర్తింపు.



**రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి కోనరావుపేట, ( ప్రజాబలం ),** తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఊరు గాని ఊరిలో ప్రాణాలు వదిలిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పొడిచేడు గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన తీపి రెడ్డి సుదర్శన్ రెడ్డి (40) గత కొంతకాలంగా తాగుడుకు బానిస అయ్యాడు. ఈ క్రమంలోనే భార్య, పిల్లలను వదిలేసి ఎక్కడికి పడితే అక్కడికి వెళ్లడం అలవాటుగా మారింది అని తెలిపారు. అదే క్రమంలో శనివారం రాత్రి పొడిచేడు గ్రామం వద్ద బస్సు దిగి బస్సు స్టాప్ లో పడుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అపరిచిత వ్యక్తి బస్ స్టాప్ షెల్టర్ లో తచ్చాడుతున్న విషయాన్ని గమనించి గ్రామస్తులు ఆరా తీయగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తి సరైన సమాధానాలు చెప్పలేకపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తీరా ఉదయం అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని చూసిన గ్రామస్తులు, అతని దగ్గరకు వెళ్లి చూడగా చనిపోయినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి అతని సెల్ ఫోన్ ద్వారా అతనికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించగా సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. చార్జింగ్ పెట్టి అనంతరం వాకబు చేయగా సమాచారం లభించింది అన్నారు. భార్య బంధువుల కోరిక మేరకు అతని మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోత్కూర్ పోలీసులు తెలిపారు.

## విజ్ఞాన శాస్త్రాలపై ఉచిత సైన్స్ శిక్షణ శిబిరం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల ఏప్రిల్ 21 :** వేసవి సెలవులలో జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో విజ్ఞాన శాస్త్రాలపై ఉచిత సైన్స్ శిబిరం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య,జిల్లా సైన్స్ అధికారి మధుబాబులతో కలిసి సైన్స్ సమ్మర్ క్యాంప్ గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహిస్తూ విద్యార్థి దశ నుండి విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంచుకునేలా అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ఈ క్రమంలో వేసవి సెలవులలో ఈ నెల 25వ తేదీ నుండి 12 రోజుల పాటు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గల జిల్లా సైన్స్ కేంద్రంలో ఉచిత సైన్స్ శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నూతన ఆవిష్కరణలు రూపొందించడంలో మమేకమై భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. శిబిరం కొరకు ఇప్పటి వరకు 212 మంది విద్యార్థులు తమ వివరాలు నమోదు చేసుకున్నారని, ప్రభుత్వ సంబంధిత పాఠశాలలలో 9, 10 తరగతుల విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, 6 నుండి 10 తరగతుల వరకు ఉన్న పాఠ్యాంశాల సైన్స్ ప్రయోగాలను విద్యార్థులతో ప్రత్యక్షంగా చేయించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని,గూగుల్ ఫారం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులలో జిల్లాలో మొత్తం 100 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు లారీ దగ్ధం

సూర్యాపేట నేరేడుచర్ల లో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నేరేడుచర్ల మండలం లోని చిల్లేపల్లి వద్ద లారీపై పిడుగు పడింది. ఘటనలో లారీ పూర్తిగా దగ్ధమైంది. లారీ కరీంనగర్ నుంచి చెన్నైకు పత్తిలోడుతో వెళ్తుంది. ఘటనలో ఎవరికి ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక పోలీసులు ఫైర్ స్టేషన్ కి ఫోన్ చేయగా వెంటనే ఫైర్ ఇంజిన్ ఫైర్ ఇచ్చింది. సిబ్బంది వచ్చి మంటల ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే కాలి బూడిదైయింది.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 21 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి నుండి దరఖాస్తులు స్వీకరించారు. భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి చెందిన రెడ్డి స్వామి తన భూవివాదం విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన ఆత్మకూరి అనూష తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన ఎండి.అఫ్సర్ ఖాన్ బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూములను అక్రమంగా విక్రయించడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన కొక్కర లక్ష్మి తాను గతంలో కొనుగోలు చేసిన భూమి నుండి జాతీయ రహదారి విస్తరణలో కొంత భూమి పోయిందని,మిగిలిన భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బియ్యాల శంకర్ తనకు గ్రామ శివారులో గల భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.జన్నారం మండల కేంద్రానికి చెందిన ఎస్.అంజయ్య తనకు గ్రామ శివారులో పట్టా భూమి ఉందని,ఇట్టి భూమి నిషేధిత జాబితాలో చేర్చబడిందని,సవరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.మందమర్రి పట్టణంలోని విద్యానగర్కు చెందిన ఆవుల నిర్మల తన తండ్రికి హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో లావుని పట్టా భూమి ఉందని,ఆన్లైన్ రికార్డులలో ఇతరుల వివరాలు చూపుతున్నాయని,ఈ విషయంపై విచారించి తన తండ్రి మరణించినందున ఇట్టి భూమిని తన పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.మందమర్రి మండలం ఊరు మందమర్రి గ్రామానికి చెందిన మెరుగు పోసు తనకు వంశ పారంపర్యంగా సంక్రమించిన భూమికి సంబంధించి హద్దులు నిర్ణయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నామని, ఇట్టి భూమికి సంబంధించి హైకోర్టు నందు కేసు కొనసాగుతుందని, భూమి హద్దులు సమర్పించవలసి ఉన్నందున త్వరగా హద్దులు నిర్ణయించి ఇవ్వగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం బి.ఐ.ఎస్. కేర్ యాప్కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.అన్ని ప్రభుత్వ శాఖలు మార్కెట్ లోని ఉత్పత్తులు, బి.ఐ.ఎస్. ప్రమాణాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,ఉత్పత్తుల నాణ్యత ప్రాముఖ్యత గురించి తెలిసి ఉండాలని, ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు కేర్ యాప్ ఉపయోగపడుతుందని,ప్లే స్టోర్ ద్వారా యాప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.ఈ యాప్ ద్వారా ఉత్పత్తి,ప్రామాణికత,లైసెన్స్ గడువు, లైసెన్సారుని వివరాలు తెలుసుకోవచ్చని, హెచ్.యు.ఐ.డి.హాల్ మార్క్ గల ఆభరణాల ప్రామాణికత తెలుస్తుందని తెలిపారు.వినియోగదారులు తాము కొనుగోలు చేసే వస్తువుల విషయంలో బి.ఐ.ఎస్. యాప్ ద్వారా సరైన వాటిని కొనుగోలు చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి.ఐ.ఎస్.జిల్లా ప్రతినిధి రాళ్ళబండి రాజన్న, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొంటున్నారు.

## యాసంగి 2022-23 వరిధాన్యం బకాయిలు పూర్తిగా చెల్లించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 21 :** మంచిర్యాల జిల్లాలోని యాసంగి 2022-23 సంవత్సరానికి సంబంధించి వరిధాన్యం బకాయి ఉన్న రైస్ మిల్లర్లు బకాయిలను వెంటనే పూర్తిగా చెల్లించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు,జిల్లా మేనేజర్ శ్రీకళ, రైస్ మిల్లర్లతో బకాయి చెల్లింపులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో యాసంగి 2022-23 సంవత్సరానికి గాను రైస్ మిల్లులకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా ఆక్షన్ వరిధాన్యం బకాయి ఉన్న దాదాపు 87 కోట్ల రూపాయలను రైస్ మిల్లర్లు వెంటనే చెల్లించాలని, 1 కోటి రూపాయల లోపు ఉన్న వారు తక్షణమే చెల్లించాలని,లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆక్షన్ వరిధాన్యం బకాయి పూర్తి చేసి యాసంగి 2024-25కు సంబంధించి వరిధాన్యం దిగుమతి చేసుకోవడానికి సంసిద్ధంగా ఉండాలని,అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ పౌరసరఫరాల అధికారి,అసిస్టెంట్ గ్రేడ్-1 అధికారి,జిల్లా రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ 25వ వార్షికోత్సవ సభను విజయవంతం చేద్దాం

### అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 21(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా/**మునిపల్లి మండల పరిధిలోని పిఎస్ఆర్ గార్డెన్లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పాల్గొన్నారు,అనంతరం మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తి లో జరిగే బిఆర్ఎస్ పార్టీ 25వ వార్షికోత్సవం సభను ప్రతి కార్యకర్త విజయవంతం చేయవలసిన అవసరం ఉన్నదని గత 25 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యమంతో ఎన్నో విజయాలను సాధించి తెలంగాణ ప్రజల ఆకాంక్ష లను నెరవేర్చి 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేరువై పాలన అందించిందని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలతో ప్రజలకు మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి నేడు హామీలు అమలు చేయక పోవడంతో ప్రజలు ప్రభుత్వంపై విరుచుకు పడే సమయం ఆసన్నమైందని ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వమే రావాలని మెజార్టీ ప్రజలు ఎదురుచూస్తున్నారని వారన్నారు రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు బిఆర్ఎస్ పార్టీని బలపరచడానికి సిద్ధంగా ఉన్నారని వారు అన్నారు,ఏ కార్యకర్తకు ఇబ్బంది వచ్చిన కలిసికట్టుగా ఉండి దాన్ని ఎదుర్కొనే సత్తా బిఆర్ఎస్ పార్టీకి ఉందని ఈ సందర్భంగా కార్యకర్తలకు భరోసా ఇచ్చారు,కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి పైతర సాయికుమార్ మండల పార్టీ సీనియర్ నాయకులు తాజా మాజీ ఎంపీటీసీలు,తాజా మాజీ సర్పంచులు ప్రతి గ్రామ పార్టీ అధ్యక్షులు,ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ మండలి బోర్డు ఏర్పాటు చేయాలి.

### తెలంగాణ ఉద్యమకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** సోమవారం రోజున సికింద్రాబాద్లోని జిహెచ్ఎంసి సీతాఫల్ మండి ఫంక్షన్ హాల్ నందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తెలంగాణ ఉద్యమకారుల, కళాకారుల మరియు వివిధ విభాగాల రాష్ట్ర స్థాయి ప్లీనరీ సమావేశం నకు తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమల శ్రీనివాస్ రావు అధ్యక్షతన జరిగిన క్లీనరీ సమావేశమునకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీ. హనుమంతరావు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ ఎల్. రమణ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఉద్యమకారులు, కళాకారులు, మహిళా బృందాలు కళాకారుల ర్యాలీతో వేదిక వద్దకు చేరుకున్నారు. వివిధ జిల్లాల నుండి ముఖ్య కళాకారులు ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తూ, చప్పట్లు, హర్షధ్వానుల మధ్య కళాకారుల కళ ప్రదర్శన కొనసాగించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన ఘనత కళాకారులదే అని చెప్పక తప్పదన్నారు. మా తెలంగాణ మాకు వస్తే మా కళాకారుల బ్రతుకులు మారుతాయి అని అనుకున్నాము కానీ ఏ మాత్రం మారలేదు. గత ప్రభుత్వం లో మమ్మల్ని పట్టించుకున్న నాయకుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్హులైన ఉద్యమ కళాకారులను తెలంగాణ సాంస్కృతిక సారధిలో 1000 మంది కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించండి అని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ కళాకారులుగా గుర్తించి ప్రభుత్వం గుర్తింపు కార్డులను అందజేయాలని, ఉద్యమ వృద్ధ కళాకారులను గుర్తించి నెలకు 25 వేల గౌరవ వేతనం చెల్లించాలని, 250 చదరపు గజాల ఇళ్ల స్థలం ఇచ్చి కళాకారులను ఆదుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమ కళాకారుల సంక్షేమ మండల బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశమునకు 33 జిల్లాల నుండి ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు, మహిళా కళాకారులు సుమారు 2000 మంది పాల్గొన్నారు. ఈ ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఉద్యమ కళాకారులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి, టి యు ఎఫ్ టీవీ ఛానల్ చైర్మన్ వెంగళ భాస్కర్, ఉపాధ్యక్షులు ఇందర్ కుమార్, వీరస్వామి మీడియా ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జానకి రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ ఆర్కే భూపాల్, రాంబాబు, గ్రేటర్ నాయకులు దయానంద్, చంద్రశేఖర్ స్వరూప 1969 ఉద్యమకారుడు శివకుమార్ నేత, ఫోరం ఆఫీస్ ఇంచార్జ్ అవినాష్, రాజన్న సిరిసిల్ల ఉద్యమ అధ్యక్షుడు బొజ్జ కనకయ్య, కళాకారుల జిల్లా అధ్యక్షులు వారాల దేవయ్య, ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ బొడ్డు రాములు, హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ తెలంగాణ ఉద్యమ ఉత్తమ నంది అవార్డు గ్రహీత వెన్నమల్ల వెంకటేష్, జిల్లా అధ్యక్షులు శ్రావణపల్లి శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమ కళాకారుల పురం ఉపాధ్యక్షులు కనపర్తి హనుమాన్, ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ, మారుపాక శంకర్, బుర్రి శంకరయ్య, దొంగరి లక్ష్మీరాజ్యం, వెదిరే రవి, బొడ్డు నారాయణ, మేకల రమేష్, ఎరుపుల దేవయ్య, ఎర్ర దేవయ్య, మొగిలోజి లక్ష్మీరాజం, బిల్లా వెంకట్ నర్సు, ఈర్నపల్లి కిషన్, వనం రాజయ్య, సుద్దాల దేవయ్య, వినీత్, జిల్లా కోశాధికారి చిలుముల రమేష్ చారి, గుమ్మడి రాజేశం గౌడ్, పెంద్యాల బాల్రెడ్డి, అక్కపల్లి లక్ష్మీనారాయణ, మహిళా కోలాట కళాకారులు పడిగల స్వప్న, పల్లికొండ గౌతమి, పెద్ద మేకల లక్ష్మి, పందిరి విజయ, 33 జిల్లాల, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కళాకారులు పాల్గొన్నారు.



## జేఎన్టీయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరవధిక సమ్మె.

### జేఎన్టీయూ అగ్రహారం కళాశాలలో మూడవరోజు నిరవధిక సమ్మె.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న రాష్ట్ర కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అసోసియేషన్ పిలుపుమేరకు సోమవారం రోజున అగ్రహారం కళాశాలలో పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరవధిక సమ్మె మూడవరోజు కొనసాగుతుంది.

మా సమస్యకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి 12 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అందర్నీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం జేఎన్టీయూ కళాశాలలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొనడం జరిగిందని, డి.భాస్కర్, జి. శ్రావణ్ కుమార్, బి. రవి కుమార్, తదితరులు తెలిపారు.

## ఘనంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జన్మదిన వేడుకలు

### కోలాహలంగా మారిన సంగారెడ్డి పట్టణం





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 21(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు,మొదటగా సదాశివపేట లోని తన స్వగృహంలో ఉదయం నుండే కార్యకర్తలు భారీగా తరలి వచ్చి కేక్ లు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు,సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్య ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కేక్ కట్ చేశారు,అభిమానులు పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుత్యంతో గజ మాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు,పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా మొదలుకొని ఐబీ,కొత్త బస్టాండ్ పాత బస్టాండ్ వద్ద ఫ్లెక్సీ లు వేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు,క్యాంపు కార్యాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు,ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జైపాల్ రెడ్డి పాల్గొని ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,ప్రజలు తనపై చూపిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు,సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల ఆధారాభిమానాలు ఎల్లప్పుడూ తనపై ఉండాలని ఆకాంక్షించారు,కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతిధులు పాల్గొన్నారు.

## రుద్రంగి అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం.

### పోషణ పక్షంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మమతా ఆధ్వర్యంలో కార్యక్రమం.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, రుద్రంగి, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐ సి డి ఎస్, సిడిపిఓ సౌందర్య ఆదేశాల మేరకు రుద్రంగి మండల కేంద్రంలోని ఐదవ అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్నటువంటి పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను గురించి తెలియజేయడం జరిగింది. ఇందులో భాగంగా పిల్లలు యొక్క ఐదు డెవలప్మెంట్ అనగా శారీరక అభివృద్ధి, మానసిక భాషాభివృద్ధి, సృజనాత్మకత, సామాజిక అభివృద్ధి, అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించే కార్యక్రమాల ద్వారా జరుగుతాయని తెలియజేశారు. అంగన్వాడి కేంద్రంలో జరిగే ఆట పాటల, విద్యా ద్వారా పిల్లలపై ఎలాంటి ఒత్తిడి ప్రభావం ఉండదు అని తెలియజేయడం జరిగింది. ఇందులో భాగంగా పిల్లలకి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ మంజుల, జ్యోతి, శారద, అనసూయ, కవిత, సరిత మరియు తల్లులు పాల్గొన్నారు.

## న్యాయపోరాటంలో ఆదిని వరించిన గెలుపు.

### సోమవారం రోజున హైకోర్టు జరిమానా విధించిన30 లక్షలు అందజేసిన చెన్నమనేని రమేష్ బాబు.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** వేములవాడ ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పౌరసత్వం పై గత దశాబ్ద కాలంగా చేస్తున్న న్యాయపోరాటంలో చివరకు విజయం ఆది శ్రీనివాస్ సాధించారు.

గతంలో చెన్నమనేని రమేష్ బాబు 30 లక్షలు ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు, సోమవారం హైకోర్టు అడ్వకేట్ లు వి.రోహితరావ్, వి. రవి కిరణ్ రావుల సమక్షంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు 25 లక్షలు జరిమానా అందజేయడం జరిగింది.

హైదరాబాదు హైకోర్టులో ఆది శ్రీనివాస్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ కౌన్సిల్ వి. రవి కిరణ్ రావ్, వి.రోహిత్ రావ్ డిసెంబర్ 9,2024 సంవత్సరంలో వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబుకు వ్యతిరేకంగా హైకోర్టు సంచల తీర్పు ఇచ్చింది.

చెన్నమనేని రమేష్ బాబు భారత పౌరుడు కాదని, జర్మన్ పౌరుడు అని తేల్చి చెప్పిన హైకోర్టు.

తప్పుడు పత్రాలతో అధికారులు, న్యాయస్థానాలను15 సంవత్సరాల పాటు తప్పు పట్టించారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నమనేని రమేష్ బాబు భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు.

చెన్నమనేని రమేష్ బాబు 30 లక్షలు చెల్లించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది.

30 లక్షల రూపాయలలో పిటీషనర్ ఆది శ్రీనివాస్ కు 25 లక్షల రూపాయలు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి 5 లక్షల రూపాయలు చెల్లించాలని ఆదేశించింది.

2009 సంవత్సరంలో మొదటిసారి వేములవాడ ఎమ్మెల్యేగా విజయం సాధించిన చెన్నమనేని రమేష్ బాబు.

చెన్నమనేని రమేష్ బాబు భారత పౌరుడు కాదని గత 15 ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్న ఆది శ్రీనివాస్. ఆది శ్రీనివాస్ న్యాయపోరాటం కారణంగా 2019 సంవత్సరంలో చెన్నమనేని రమేష్ బాబు భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్రం.

కేంద్ర నోటిఫికేషన్ పైన హైకోర్టు నాశ్రయించిన చెన్నమనేని రమేష్ బాబు. ఈ పిటిషన్ పైన ఐదేళ్లపాటు విచారణ జరిగిన అనంతరం తీర్పు వెలువరించిన జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి, ఏకంగా కోర్టు 30 లక్షల రూపాయలు చెల్లించాలని తీర్పునిచ్చిన కేసులు చరిత్రలో లేవంటున్న న్యాయ వర్గాలు. 15 సంవత్సరాల పాటు పోరాడి విజయం సాధించిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్.

భారతదేశ పౌరుడు కాకుండా 15 సంవత్సరాల పాటు భారతదేశ చట్టసభల్లో సభ్యులుగా కొనసాగిన చెన్నమనేని రమేష్ బాబు.

నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా కాకుండా ఆది శ్రీనివాస్ అవకాశాలకు గండి కొట్టిన చెన్నమనేని రమేష్ బాబు.

కోర్టు తీర్పు పైన అపీల్ చేయకుండా తప్పు ఒప్పుకొని 30 లక్షల రూపాయలు చెల్లించిన చెన్నమనేని రమేష్ బాబు.

ఆది శ్రీనివాస్ పిటిషనర్... ప్రభుత్వ విప్ మాట్లాడుతూ15 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటంలో న్యాయం గెలిచిందన్నారు.

తప్పుడు ధృవ పత్రాలతో న్యాయస్థానాలను, ప్రభుత్వాలను చెన్నమనేని రమేష్ బాబు మోసం చేశాడు అన్నారు. గతంలో హైకోర్టు చెన్నమనేని రమేష్ బాబు భారత దేశ పౌరుడు కాదని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశాడు.

దీంతోపాటు 15 సంవత్సరాల పాటు న్యాయస్థానాలలో పోరాటం చేస్తున్న నాకు 25 లక్షలు, లీగల్ సేల్ కు 5 లక్షలు చెల్లించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని సందర్భంగా గుర్తు చేశాడు.

హైకోర్టు తీర్పు నేపథ్యంలో సోమవారం రోజున చెన్నమనేని రమేష్ బాబు 25 లక్షలు తన న్యాయవాది ద్వారా డిడి అందించాడని తెలిపారు. 5 లక్షలు లీగల్ సెల్ కు కూడా చెల్లించడానికి పేర్కొన్నారు.

నాలుగు సార్లు మోసం చేసి గెలిచిన చెన్నమనేని రమేష్ బాబు పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. చెన్నమనేని రమేష్ బాబు వేములవాడ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2009 నుండి2023 వరకు చెన్నమనేని రమేష్ బాబు ఎమ్మెల్యే కాదని గెజిట్ నోట్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కూడా కాకుండా అతనికి ప్రభుత్వం నుండి ఎలాంటి బెనిఫిట్స్ రాకుండా చూడాలన్నారు. నా తరఫున కేసును వాదించిన సీనియర్ కౌన్సిల్ వి.రవి కిరణ్ రావ్, రోహిత్ రావులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## రెడ్డి సంక్షేమ సంఘం కార్యక్రమం నూతన కార్యవర్గం ఎన్నిక




**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 21 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండల రెడ్డి నూతన సంఘ కార్యకవర్గ ఎన్నికను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం మోహన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీధర్ రెడ్డిలు తెలిపారు. అధ్యక్షులుగా పాలమాకుల సురేందర్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా ముస్కు రత్నాకర్ రెడ్డి,కేతిరెడ్డి రజాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా బోడ సతీష్ రెడ్డి,సహాయ కార్యదర్శి నాగిరెడ్డి సంతోష్ రెడ్డి, కేతిరెడ్డి వినోద్ రెడ్డి,నాగిరెడ్డి అనంతరెడ్డి,కోశాధికారిగా కేతిరెడ్డి బుచ్చిరెడ్డి,సలహాదారులుగా కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి,కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కేతిరెడ్డి భూంరెడ్డి, గాగిరెడ్డి చొక్కా రెడ్డి,కేతిరెడ్డి బాబు రెడ్డిలు

# భూ భారతి చట్టం ద్వారా ఎక్కువ మొత్తంలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయి.




**ప్రజాబలం ప్రతినిధి ములుగు జిల్లాతేది. 21. 4. 2025.** భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి.

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరించడానికి అమలు చేయనున్న భూ భారతి చట్టం ద్వారా ఎక్కువ మొత్తంలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.

సోమవారం మల్లంపల్లి మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొని రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

ధరణిలోని పొరపాట్లని సవరించేందుకు కలెక్టర్ కి మినహా ఏ అధికారికీ అవకాశం లేదని చెప్పారు. దీనివల్ల తాహసిల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. చిన్న చిన్న సమస్యలు కూడా తహసిల్దార్లు, ఆర్డీవో పరిష్కరించలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. రెండెంతల అప్పీలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లవలసిన అవసరం దాదాపు ఉండదని తెలిపారు.

2014 సంవత్సరంలో సాదా బైన మా కోసం కానీ 2020 సంవత్సరంలో అప్పటి ధరణి పోర్టల్ లో పేరు నమోదు చేసుకొని పట్టాలు పొందడానికి ప్రయత్నించినప్పటికీ సమస్యలు పరిష్కారం కానివి నేటి ప్రజా ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గతంలో ఉన్న చట్టానికి అనుగుణంగా మరో 14 నూతన అంశాలను ప్రభుత్వం పొందుపరిచిందని, 2010 సంవత్సరంలో ప్రతి వ్యక్తి తన గుర్తింపు కోసం ఆధార్ కార్డు ఎలా పొందారో అదే తరహాలో భూ భారతి చట్టం ద్వారా భూమి హక్కు పట్టాలను పొందగలుగుతారని తెలిపారు.

ఈ కార్యక్రమములో ఆర్డీఓ వెంకటేష్, తహసిల్దార్ విజయ భాస్కర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

## గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 25 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్.,




**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్–21 (ప్రజాబలం ప్రతినిధి)**ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 25 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# వరంగల్ జిల్లాలో నిర్వహించే బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఏప్రిల్ 21** ఈ నెల 27 వ తేదీన వరంగల్ జిల్లాలో నిర్వహించే బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సభ కు సంబంధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్తీ, ప్రతి కాలనీ నుండి పెద్ద సంఖ్యలో సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం 1969 లోనే పుట్టినప్పటికీ వివిధ కారణాలతో అవి మధ్యలోనే ముగిశాయని తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి, ప్రజలకు అన్ని విధాలుగా ఎంతో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధన తోనే న్యాయం జరుగుతుందని గుర్తించిన ఉద్యమ నాయకుడు కెసిఆర్ నాయకత్వం లో టిఆర్ఎస్ పార్టీ పుట్టిందని అన్నారు. అనేక పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. రాష్ట్రం కోసం కెసిఆర్ ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడిన విషయాన్ని వివరించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ను అభివృద్ధి, సంక్షేమ రంగాలలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్ర అభివృద్ధి మళ్ళీ మొదటికొచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ రాష్ట్ర ప్రజలకు బి ఆర్ ఎస్ పార్టీ, కెసిఆర్ శ్రీ రామరక్ష అన్నారు. తిరిగి కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ పుట్టి 25 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 27 వ తేదీన అన్ని డివిజన్ లలో పార్టీ జెండాలను ఎగురవేసి పార్టీ పండుగను ఘనంగా నిర్వహించాలని చెప్పారు. వరంగల్ జిల్లాలో నిర్వహించే రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్, నాయకులు నాగులు, కిషోర్, శ్రీహరి, నరేందర్, అశోక్ యాదవ్, ఏసూరి మహేష్, లక్ష్మీపతి, కరుణాకర్ రెడ్డి, ఖలీల్, సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




# మానసిక వికలాంగుల పట్ల ప్రేమ చూపాలి భవిత కేంద్రం ఉపాధ్యాయుడు రమేష్






**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 21 :** సమాజంలో ప్రతి ఒక్కరు దేవుడు సృష్టించిన మనుషులేనని,వారి అదృష్టం మంచి లేక మానసిక వికలాంగులుగా జన్మిస్తారని వారి పట్ల మంచిగా ఉన్న ప్రతి ఒక్కరు ప్రేమ చూపాలే తప్ప వారిని తక్కువ చూపు చూడవద్దని భవిత కేంద్రం మానసిక వికలాంగుల పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు.సోమవారం మహాత్మ జ్యోతిబాపూలే బాలుర కళాశాల పాఠశాలలో పీ ఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా మానసిక వికలాంగులపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ విద్యార్థులకు పలు మానసిక రుగ్మతులపై అవగాహన కల్పించారు. మంచిగా ఉన్న వారి కంటే మానసిక రుగ్మతలు ఉన్నవారికి పలు అంశాల్లో ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు.ఇలాంటి వారిలో చాలామంది ఉన్నత స్థాయి అధికారులు కూడా ఉన్నారని గుర్తు చేశారు.వీరి కోసం ప్రభుత్వాలు కూడా ప్రత్యేక పాఠశాల ఏర్పాటుచేసి వారి భవిష్యత్తును తీర్చే తీర్చిదిద్దడానికి వేలాది కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయని తెలిపారు.దీనిలో భాగంగా బ్రెయిలీపి,పోలియో,మానసిక వికలాంగులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ప్రతి మండల కేంద్రంలో భవిత కేంద్రాలు ఉన్నాయని తెలిపారు వీటిని మానసిక వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వచ్చే విద్యా సంవత్సరానికి ప్రతి పాఠశాలలో ప్రత్యేక కోర్సులపై ముగ్గురు ఉపాధ్యాయులను నియమించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. మండలంలోని కొంతమంది మానసిక వికలాంగులను సైతం పాఠశాలకు పిలిపించి వారి పట్ల పిల్లలకు అవగాహన కల్పించిన అనంతరం మానసిక వికలాంగులకు బహుమతులు అందజేశారు. గురుకుల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి భవిత కేంద్రం పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్ తో పాటు గురుకుల పాఠశాల ఏటీపీ సాగర్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మారుమోగిన రాజన్న ఆలయం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రోజు కావడంతో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సుదూర ప్రాంతాల నుండి వేములవాడ రాజన్న ఆలయానికి చేరుకున్న భక్తులు వేకువజాము నుండే తమ కుటుంబ సభ్యులతో పవిత్ర ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని, క్యూలైన్ల ద్వారా వెళ్లి రాజన్నకు ప్రీతికరమైన కోడెమొక్కులను చెల్లించుకొని, తదనంతరం స్వామి వారిని దర్శించుకుని అనుబంధ ఆలయాలలో వివిధ రకాల పూజలు నిర్వహించి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. విపరీతమైన ఎండ వేడిమిని సైతం లెక్కచేయకుండా భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారుగా మూడు గంటల సమయం పట్టింది. సోమవారం రోజున రాజన్న ఆలయానికి సుమారుగా 50,000 మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రాజన్న ఆలయ ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేసినారు.

# అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అగోరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు.

## వేములవాడ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైకి మొన్నటి రోజున అనుచిత వ్యాఖ్యలు చేసిన అగోరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ అభిమాన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని పోలీస్ స్టేషన్లో సోమవారం రోజున ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు రక్షణ కవచంగా రాజ్యాంగాన్ని అందించి ప్రజాస్వామిక దేశంగా ప్రతి జీవికి హక్కులు కల్పించిన మహనీయునిపై ఒక టీవీ ఛానల్ రిపోర్టర్ తో ఫోన్లో మాట్లాడుతున్న సందర్భంలో అంబేద్కర్ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆగోరిని చట్టపరంగా శిక్షించాలని అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో జింక శ్రీధర్, మూలే కిషోర్, గుడిసె మనోజ్, రాగుల రాంప్రసాద్, పెంట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఇలాఖ పుల్కల్లో నీటి కష్టాలు



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 21 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని పుల్కల్ గ్రామంలో గత వారం పది రోజులుగా త్రాగడానికి చుక్క మంచినీరు రాక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, వరి పంటపొలాల దగ్గర నుంచి బోరు నీళ్లు తెచ్చుకుని వాడుకుంటున్నారు త్రాగడానికి ప్రైవేట్ వ్యాపారుల దగ్గర పది రూపాయలకు ఒక డబ్బా కొనుగోలు చేసి తెచ్చుకొని త్రాగడం జరుగుతుంది,, మంత్రి దామోదర్ రాజనర్సింహ పుల్కల్ నా సొంత గ్రామం అని ఎన్నికల సమయంలోచెప్పుకుంటారు కానీ సమస్యలు వస్తే పట్టించుకునే నాధుడే లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, శనివారం నాడు మహిళలు అందరూ కలిసి రోడ్డు ఎక్కి ఖాళీ బిందెలతో ధర్నా చేశారు, పంచాయతీ కార్యదర్శి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు, శనివారం పుల్కల్ మండలంలో మంత్రి పర్యటన ఉండడంతో, అది గమనించిన కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ కార్యదర్శి కలిసి, వాటర్ ట్యాంకర్ ద్వారా ఇంటింటికి నీరు పోయించారు, మంత్రి పర్యటన ఉండడంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు, మిషన్ భగీరథ నుండి నీటిని విడుదల చేశారు, వారం పది రోజుల నుండి ప్రజలు నీటిని అడిగితే ఆ పైప్ లైన్ పగిలిపోయింది అని చెప్పారు, ఇప్పుడు ఎలా నీటిని వదిలారు అని పంచాయతీ సెక్రెటరీని చెర వాణి ద్వారా అడిగితే అవును పైప్ లైన్ పగిలిపోయింది అని చెప్పారు నీటిని వదిలారు మంత్రి పర్యటన ఉంటేనే త్రాగడానికి నీటిని ఇస్తారా అంటూ మహిళలు గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఇకనైనా మాకు మంచి నీటి కొరత లేకుండా చూడాలని ప్రజలు అధికార పార్టీ నాయకులను, అధికారులను, కోరుతున్నారు...

# ఏ.ఎస్.బి.ఎల్ టవర్ నివాసుల ఇబ్బందులు



రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 21 ఏప్రియల్ 2025గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు ఆదివారం రోజున ల్యాంకో హిల్స్ పరిధిలోని ఏ.ఎస్.బి.ఎల్ లేక్ సైడ్ టవర్ అపార్ట్మెంట్ కు వెళ్ళడం దరిమిలా స్థానిక ప్రజల ముఖ్య సమస్యగా ఇరుకు రహదారిలో ట్రాఫిక్ కు అంతరాయం కలిగే విధముగా సైన్ బోర్డులు పెట్టీ రాక పోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని వాపోయారు, పరిష్కార మార్గంగా ల్యాంకో హిల్స్ నుండి సాయికృప వారు వేసిన లేఔట్ ప్రకారము హై టెన్షన్ వైర్ల క్రింద నుండి పద్మనాభ స్వామి ఆలయం వెళ్ళడానికి అనువుగా ఏర్పాటు చేసిన పాత రహదారి మార్గ సూచికలు ఉన్నను ఫెన్సింగ్ వేసి రహదారి మూసివేయడం జరిగినదని అట్టి ఫెన్సింగ్ తొలగించి ప్రజల సౌకర్యార్థం రహదారి కొనసాగించాలని కోరారు. ఒక వైపు మున్సిపాలిటీ వారు, మరొక వైపు రిజిష్ట్రేషన్ అధికారులు ఒకే ఫ్లాట్ కు ఆస్తి పన్ను ఇద్దరికి కట్టమని వత్తిడి చేస్తున్నారనీ తెలియ జేసినారు. రహదారి వీధి దీపాలు లేనందున నిర్మానుష్యంగా ఉన్న పద్మనాభ స్వామి ఆలయం త్రోవలో రాత్రి కాగానే కొంత మంది మత్తు పానీయాలు సేవించిన తరువాత పెద్దగా అల్లర్లు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కావున పోలీసు పెట్రోలింగ్ చేయించండనీ ప్రాధేయ పడ్డారు. అపార్ట్మెంట్ వెనుక ఉన్న ఖాజాగూడ సరస్సు కొద్ది కొద్దిగా కబ్జాకు గురవుతున్నదనీ చెప్పడం జరిగినది.



ఇట్టి కార్యక్రమంలో స్థానికులు కృష్ణ, శ్రీధర్ నాయుడు, ప్రశాంత్, శ్రీధర్, జైరామ్, నరేష్, కోటి రెడ్డి, సురేష్, శ్రీకాంత్, శివ, రాణా, శ్రీనాథ్ రెడ్డి, సిద్దేశ్వర్, రవీందర్, బాలు, రఘు ఉయ్యాల, రమణ రెడ్డి, కృష్ణ, ఆశ, శాంత, విశ్వజిత్, సచిన్ లతో పాటు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, కోడిచెర్ల దేవేందర్, యాలాల కిరణ్, భాను చందర్, జైరామ్, సుమనళిని, షేక్ ఆరిఫ్, చెరుకూరి బాలాజీ, రమణ మూర్తి, యాలాల బెన్నీ తది తరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఎర్తింగ్ సరిచేయండి



రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 21 ఏప్రిల్ 2025మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని క్వార్టర్స్ వద్ద విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు ఎర్తింగ్ సరిగా లేనందువలన పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజానీకానికి చిన్న పాటి కరెంట్ షార్ట్ లు కొట్టడం జరిగినదనీ, ఈ మధ్య కాలంలోని వర్షం వల్ల ఇట్టి తీవ్రత ఎక్కువగా ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున సంబంధిత విద్యుత్ శక్తి అసిస్టెంట్ ఇంజనీర్ నీ కలసి విషయాన్నీ తెలియ పరుస్తూ వ్రాత పూర్వక వినతి పత్రం అందజేయాగ అట్టి అధికారి సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం చేయిస్తానని నమ్మబలికాడు, అధికారిని కలసిన వారిలో భాను చందర్, కోడిచెర్ల దేవేందర్, ముత్తంగి లక్ష్మయ్య, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, బుద్దోలు బాబు, బిట్లుగా రాజు, సుమనళిని, ముత్యాలు తదితరులు కలరు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 21: మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామ జాతీయ రహదారిపై నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మునుగంటి చంద్రశేఖర్ అనే 51సంవత్సరాల వ్యక్తి మృతి చెందడం జరిగింది. మృతుడు వెంకట్రావుపేట గ్రామానికి చెందిన వాడు. నిన్న మధ్యాహ్నం మృతుడు తన పురోహితం పని ముగించుకొని వెంకట్రావుపేటకు బైక్ నడుపుకుంటు వెళ్తుండగా వెనకాల నుండి బెలినో కార్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి.కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా మృతిచెందారు.మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురు జాహ్నవి పిర్యాదు మేరకు వాహన డ్రైవరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని లక్షెట్టిపేట ఎస్సై జి సురేష్ తెలిపారు.

# కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు

## జోగిపేట సీఐ అనిల్ కుమార్




అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 21, ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా, జోగిపేట సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కుల మతాల విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పోస్టులు పెట్టిన, కఠిన చర్యలు తప్పవని జోగిపేట సిఐ అనిల్ కుమార్ హెచ్చరించారు, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు, ఈ మధ్యకాలంలో వాట్సాప్, ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్ లలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు వస్తున్న సందర్భంగా సీఐ అనిల్ కుమార్ ఒక ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, సోషల్ మీడియాపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టిందని, రెండు వర్గాలు గాని,గ్రూపుల మధ్య గాని, కుల మతాల మధ్య గాని, ఇతరుల మనోభావాలు దెబ్బ తినే విధంగా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టిన, ఫార్వార్డ్ మెసేజ్లు చేసిన ఉపేక్షించేది లేదని, ఎంతటి వారి కైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, ఒకరి మత సాంప్రదాయాలను మరొకరు విమర్శించరాదని, మరొకరు గౌరవించినప్పుడే మతసామరాష్ట్యం నెలకొంటుందని కులమతాలకు అతీతంగా వచ్చే పండుగలను జరుపుకోవాలని అన్నారు విద్యార్థి దశలో పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అవుతూ ఉంటే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు అవుతారన్నా విషయ యువతీ యువకులు దీన్ని దృష్టిలో పెట్టుకుని నడుచుకోవాలని అన్నారు..

# ప్రజల అర్జీలను త్వరగా పరిష్కరించాలి

## మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,డిఆర్ఓ హరిప్రియ



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 21:జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సవస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియ తో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (106) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ఐకేపీ సెంటర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్

ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 21 : మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని కన్నేపల్లి గ్రామంలో ఐకేపీ సెంటర్ వరి సెంటర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.సోమవారం ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు తోట మోహన్,ముత్తే నారాయణ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు చుంచు నాగేష్, ఆకుల తిరుపతి,బేరా రామయ్య, ముత్తే శంకరయ్య,తోట మహేష్, గ్రామానికి చెందిన రైతులు ఐకెపి సెంటర్ ఇన్చార్జి జనార్ధన్ సి ఎ బాలసాని అనూష సెంటర్ నిర్వాహకులు మూగల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన బీసీ గురుకులాల బ్యాక్ లాగ్ పరీక్ష

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్ సీ ఓ సేరు శ్రీధర్



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 21 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర మరియు బాలికల గురుకుల పాఠశాలల్లో 6,7,8 మరియు 9 వ తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ఆదివారంనిర్వహించిన ఎం జె పి బ్యాక్ లాగ్ సెట్ ప్రవేశ పరీక్ష ఉమ్మడి జిల్లాలోని 12 కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసినట్టు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్ సీ ఓ సేరు శ్రీధర్ తెలిపారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6 వ తరగతిలో 1,150 మందికి 1,013 మంది,7 వ తరగతిలో 756 మందికి 663 మంది,8 వ తరగతిలో 783 మందికి 702 మంది మరియు 9 వ తరగతిలో 424 మందికి 379 మంది పరీక్షకి హాజరయ్యారని మొత్తంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 3,113 మంది విద్యార్థులు పరీక్షకి దరఖాస్తు చేసుకోగా 2,757 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరయ్యారని 356 మంది విద్యార్థులు పరీక్ష కి గైర్హాజరయ్యారని,విద్యార్థుల హాజరు శాతం 89 శాతంగా నమోదైనట్టు తెలిపారు.

# నూతన భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### భూ భారతితో రైతులకు సత్వర న్యాయం

### భూభారతితో రికార్డుల పటిష్టం

### జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 21, (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా, ఆందోల్ నియోజకవర్గం పరిధిలోని పుల్కల్ మండల కేంద్రంలో, శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక భూభారతి 2025, చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి హాజరై ప్రసంగించారు, భూభారతి పై రెవెన్యూ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 14, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున నూతన భూచట్టానికిశ్రీకారం చుట్టిందన్నారు, భూభారతి రైతుల భూ సమస్యలు, త్వరితగతిన సులభంగా పరిష్కరించబడతాయని అన్నారు భూభారతి చట్టాన్ని రెవెన్యూ ఇతర రాష్ట్రాల చట్టాన్ని పరిశీలించి, దాదాపుగా రెండు సంవత్సరాలుగా చాలామంది మేధావులు, చాలామంది రైతులు రైతు సంఘాల నాయకులను సంప్రదించిన అనంతరం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టారని అన్నారు, భూభారతిలో చాలా సులభతరంగా రైతు సమస్యలన్నీపరిష్కరించవచ్చు అన్నారు, రికార్డుల్లో పేరు మార్పు నూతన పౌతి లాంటివి 30 రోజుల్లో పరిష్కారం అవుతాయని అన్నారు, భూ రికార్డుల్లో పేరు మార్చడం కోసం నూతన నోటీసు విధానం అమల్లో ఉందన్నారు, గత భూ చట్టాల్లో ఈ నోటీసు విధానం లేదని గుర్తు చేశారు, రైతుకు ఏదైనా భూ సమస్య వచ్చినప్పుడు, స్థానిక తాసిల్దార్ ద్వారా పరిష్కరించుకోవచ్చని, తాసిల్దారు సమాధానం కి సంతృప్తి చెందని రైతులు ఆర్డీవో ద్వారా పరిష్కరించుకోవచ్చని, అన్నారు, ఒకవేళ ఆర్డీవో ద్వారా పరిష్కారం కానీ యెడల, కలెక్టర్కు సమస్య విన్నవించుకోవచ్చు అని, కలెక్టర్ ద్వారా కూడా కానీ యెడల, రైతు ల్యాండ్ ట్రిబ్యునల్ లో పరిష్కారం దొరికేలా ఈ చట్టంలో అవకాశాలున్నాయన్నారు, రైతుకు భూ సమస్యలను రెవెన్యూ కోర్టు ద్వారానే పరిష్కారం అయ్యేలా ఈ చట్టంలో ఉందన్నారు, రైతు సమస్యకు ఒక నెల నుంచి రెండు నెలల లోపల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు, రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగపరుచుకోవాలని పిలుపునిచ్చారు, రైతులకు భూభారతి చట్టంపై ఎలాంటి సందేహాలు ఉన్న నివృత్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు, అనంతరం పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు, వంటగదిని స్టోర్ రూమ్ ను పరిశీలించారు, మెనూ అమలు చేస్తున్నారా లేద అని అడిగి తెలుసుకున్నారు, తప్పకుండా మెనూ అమలు చేయాలని కస్తూర్బా పాఠశాల సిబ్బందినిఆదేశించారు,ఈకార్యక్రమంలో,అదనపు కలెక్టర్ మాధురి, రైతు సంఘం నాయకులు రైతులు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి: కమిషనర్ ఇలంబర్తి

### జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 193 ఆర్జీలు




హైదరాబాద్, ఏప్రిల్ 21: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు.

సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కమిషనర్ వినతులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదు ను క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు రిపీట్ కాకుండా నివారించాలని సూచించారు.

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 82 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 32, ట్యాక్స్ సెక్షన్ 9, శానిటేషన్ 6, ఇంజనీరింగ్ విభాగం 5, అడ్మినిస్ట్రేషన్, హెల్త్, ల్యాండ్ అక్విజిషన్, ఎస్టేట్స్ విభాగాలకు 3 చొప్పున, ప్రాజెక్ట్స్, యు.బి.డి, లేక్స్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్, ఎలక్షన్స్, యు.సి.డి విభాగాలకు రెండు చొప్పున, అడ్వర్టైజ్మెంట్, విజిలెన్స్, సిపిఆర్ఓ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా ఒక ఫిర్యాదు అందింది.

జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 111 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 40, శేరిలింగంపల్లి జోన్ లో 22, ఎల్బీనగర్ జోన్ లో 21, సికింద్రాబాద్ జోన్ లో 18, చార్మినార్ జోన్ లో 9, ఖైరతాబాద్ జోన్ లో ఒక్క ఆర్జీ అందింది.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి రావు, అడిషనల్ సి సీ పీ లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సన్నాహక సభ టిఆర్ఎస్ కి చేస్తున్నారా?బిఆర్ఎస్ కి చేస్తున్నారా?

## తుపాకీ రాముడు అలియాస్ కేటీఆర్ కి సూటీ ప్రశ్న

## ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**తుపాకీ రాముడు అలియాస్ కేటీఆర్ కి సూటీ ప్రశ్న**

**రజతోత్సవ సన్నాహక సభ టిఆర్ఎస్ కి చేస్తున్నారా?బిఆర్ఎస్ కి చేస్తున్నారా?**

**దేశాన్ని దోచుకుందామని టిఆర్ఎస్ బిఆర్ ఎస్ గా మార్చింది నిజం కాదా?**

**పార్టీ నుంచి తెలంగాణ పదం తొలగించిన మీకు రజతోత్సవ సభ ఎలా నిర్వహిస్తారు?**

**తెలంగాణను దోచుకున్నందుకు కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పు**

**టిఆర్ఎస్ పార్టీ బతికే ఉందా కేటీఆర్**



హైటెక్స్ సిటీ కట్టిన చంద్రబాబు.. ఆరోగ్య శ్రీతో వైఎస్ రాజశేఖర్ రెడ్డిని..అంటూ కేటీఆర్ గుర్తు చేస్తున్నారు,

ఏం ఉద్ధరించారని కేసిఆర్ ను ప్రజలు గుర్తు పెట్టుకోవాలి..మళ్ళీ అధికారంలోకి రావాలి

పిట్టల దొర కేసిఆర్ రిటైర్ అయిపోయి ఫాం హౌస్ కి పరిమిత మయ్యిండు

8 లక్షల కోట్లు దోచుకుంది సరిపోలేదా తుపాకీ రాముడు..మళ్ళీ దోచుకుందామని ప్లాన్ తో అధికారంలోకి రావాలని తుపాకీ రాముడి ఆలోచన

సిగ్గు శరం లేకుండా తుపాకీ రాముడు మళ్ళీ అధికారం కలలు కంటున్నాడు

నీళ్లు, నిధులు, నియామకాలు పేరుతో తెలంగాణ ప్రజల్ని పిట్టల దొర అలియాస్ కేసిఆర్ ప్రజలను వంచించాడు

లిక్కర్ కవిత, హ్యాపి రావ్, పిట్టల దొర, అగ్గి పెట్ట హరీష్ రావు తప్ప బిఆర్ఎస్ లో ఎవరున్నారు

దొంగల్లా దోచుకున్న సొమ్ముతో రజతోత్సవ సభలు

పార్టీలో టీఆర్ఎస్ లేనిది రజతోత్సవ సభలు ఎందుకు

బిఆర్ఎస్ నేతలు పంచే పైసలను తీసుకోండి.. ఆ సొమ్ము తెలంగాణ ప్రజల నుంచి దోచుకుందే

కాపలా కుక్క లాంటి కళ్ల బొల్లి మాటకు చెప్పి కేసిఆర్

లేవడానికి చేతకాని పిట్టల దొర మళ్ళీ అధికారంలోకి రావాలని తుపాకీ రాముడు అనడం హాస్యాస్పదం

వాస్తవ చరిత్ర చూశాక..బుద్ధి ఉన్నవాళ్లు ఎవరైనా బిఆర్ ఎస్ పాలనను కోరుకుంటారా

కాంగ్రెస్ పాలన గురుంచి మాట్లాడటానికి తుపాకీ రాముడికి,బిఆర్ ఎస్ నేతలకు అర్హత లేదు

కాంగ్రెస్ సంక్షేమ, అభివృది చూశాక విమర్శలు చేయడానికి తుపాకీ రాముడుకి సిగ్గుండాలి

దేశం ఆశ్చర్యపోయేలా సన్న బియ్యం పంపిణీ, కేజీ టు పిజి విద్య,ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ తో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ విద్యా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోంది

పదేళ్లలో ఉద్యోగాలు ఎటుపోయాయి..ఒక్క ఇంచు మెట్రో పనులు జరిగాయా?

లక్షన్నర కోట్లలోనే మూసి ప్రక్షాళన, ఫోర్త్ సిటి

బిఆర్ఎస్ హయంలో లక్షన్నర కోట్లు పెట్టిన కాళేశ్వరం కుప్ప కూలింది

కాంగ్రెస్ పార్టీ హయంలో ప్రవేశ పెట్టిన ప్రాజెక్టులను బిఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదు

కాంగ్రెస్ పార్టీకి పే భయంతో ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ పుణ్యాన రబ్బరు చెప్పుల హరీష్ రావు మంత్రి అయ్యాడు

చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వకపోవడంతో కేసిఆర్ టీడీపీ నుంచి బయటికి వచ్చిన విషయం నిజం కాదా?

ఇచ్చిన మాటకు కట్టుబడి శ్రీమతి సోనియా గాంధీ గారు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు

రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పెట్టుబడులు ప్రభుత్వం తీసుకొస్తుంటే ఓర్వలేరా?

నోరు ఉంది కదాని ఇష్టమొచ్చినట్లు మాట్లాడకూడదు తుపాకీ రాముడు

పదేళ్లలో ఎన్ని సార్లు డిఎస్సీ వేశారో చెప్పు దమ్ముందా తుపాకీ రాముడు

21 వేల కోట్ల రుణ మాఫీ జరిగిందని లెక్కలు చెపుతుంటే అవాస్తవాలు ప్రచారం చేయడానికి కేటీఆర్ కి బుద్ధి ఉందా

బడెక్ట్ లో 3 లక్షల కోట్లు ఉంటే 70 వేల కోట్లు రైతులకు కాంగ్రెస్ సర్కార్ కేటాయిస్తుంది..మాది రైతుల సంక్షేమం ప్రభుత్వం

రాహుల్ గాంధీ గారికి సమాజం మీద సామాజిక దృక్పథం ఉన్న వ్యక్తి..అందరికీ సమన్యాయం జరగాలని కోరుకునే వ్యక్తి

హైదరాబాద్ ప్రజలు ఒక్కసారి ఆలోచించండి..ఫోర్త్ సిటి లాంటివి కడితే ఏం నష్టం

ప్రజలు ప్రతిపక్షాల విష ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండండి

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల సర్వేతో బిఆర్ఎస్ నేతల్లో వణుకు మొదలైంది

కాంగ్రెస్ సర్కార్ ఏం చేస్తుంది అన్న కేటీఆర్ లాంటి వాళ్ళ ప్రశ్న గురించి..

25 లక్షల మందికి రుణ మాఫీ జరిగిన రైతులు..ఉచిత బస్సులో ప్రయాణించే మహిళలు..ఉచిత కరెంటు లబ్ధి దారులు.. సన్న బియ్యం పంపిణీ తో లబ్ధి పొందుతున్న వారు ఆలోచిస్తారు కదా

లి నాలుగు ఎకరాల వరకు రైతు రుణ మాఫీ అయ్యింది..మిగతా వాళ్ళకి త్వరలో అవుతుంది

# మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత

## – తక్షణ సాయంగా అందజేసిన సబ్బని వెంకట్



మృతుల కుటుంబ సభ్యులకు ఇచ్చినట్టు సబ్బని వెంకట్ టీం మెంబర్స్ వెల్లడించారు.

హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 21హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన కుత్తాడి జీవన్, కొలుగూరి కుమార్లు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రముఖ సామాజికవేత్త, జెన్ప్యాక్ట్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ వారి కుటుంబాలకు బియ్యం తన టీమ్ ద్వారా అందజేశారు. జీవన్ ఫ్యామిలీకి 50 కేజీలు, కుమార్ కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యాన్ని సబ్బని వెంకట్ టీం సభ్యులు సోమవారం అందజేశారు. మృతుల కుటుంబాల ఇంటికి వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి.. రైస్ అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జీవన్ ఫ్యామిలీకి, కుమార్ కుటుంబానికి తక్షణ సాయం కింద రైస్ అందజేయాలని సబ్బని వెంకట్ ఆదేశాల మేరకు తాము వారి ఇంటికెళ్లి బియ్యం

# నేడు హుండీ లెక్కింపు



హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 21 దేవాదాయ ధర్మాదాయ శాఖ కరీంనగర్ జిల్లా - ఇల్లందకుంట మండలం, గ్రామం-శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానము యొక్క "2025-శ్రీరామనవమి-వార్షిక బ్రహ్మోత్సవముల" హుండీలను దేవాదాయ శాఖ అధికారుల అధ్వర్యంలో, భక్తుల సమక్షములో తేది: 22/04/2025 మంగళవారం రోజున ఉదయం 09-00 గం?లకు విప్పి, ఆదాయం లెక్కించుటకు నిర్ణయించారు.కావున హుండీల లెక్కింపు నందు ఆసక్తి గల భక్తులు ఎవరైనను నేడు ఉదయం 09-00 గం?ల లోపు డ్రెస్ కోడ్ (లుంగీ%ఒ% బనియన్) తో హాజరుకావాలని ఆలయ చైర్మన్ ఇంగలే రామారావు ఒక ప్రకటనలో కోరారు.

# అధికారులపై మండిపడ్డ మంత్రి పొంగులేటి

నల్గొండ చందంపేట మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు పాల్గోన్నారు.

మంత్రి పొంగులేటి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అధికారులు తమకి సహకరించట్లేదు అని, ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకొన్న లాభం లేదని భూ భాదితులు నిరసన వ్యక్తం చేసారు. సంబంధిత అధికారులవద్ద సరైన సమాచారం లేకపోవడంతో అధికారుల తీరుపై మంత్రి మండిపడ్డారు.

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కి అభినందలు , ఆరోగ్య శాఖ మంత్రి రాజనరసింహాకి కృతజ్ఞతలు

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లు, హైదరాబాద్ బస్తీల్లో, పేదులున్న ప్రాంతాల్లో, పల్లెల్లో పెట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అద్భుతమైన నిర్ణయం. క్యాన్సర్‌తో అనేక మంది చనిపోతున్నారు, అనేక కుటుంబాలు కూలిపోతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలు క్యాన్సర్ కారణంగా ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. నేను గడిచిన 20 ఏళ్లుగా ఇలాంటి అనేక కుటుంబాలు చూశాను. వీరిని ఎలా ఆదుకోవాలని ఆలోచించేవాడిని. ఇప్పుడు ట్రీట్మెంట్‌లో ఆధునికత వచ్చి క్యాన్సర్‌ను ముందే గుర్తించి క్యాన్సర్ నుంచి బయటపడొచ్చు. కానీ ముందే గుర్తించే సదుపాయాలు లేని కారణంగా మహిళలు రొమ్ము, సర్వైకల్ లాంటి క్యాన్సర్లతో ప్రాణాలు కోల్పోతున్నారు. వారికి సరైన అవగాహన లేని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. క్యాన్సర్‌ను ముందే గుర్తించి వైద్యం అందించే బాధ్యత ఇప్పటి ప్రభుత్వం తీసుకోవడం సంతోషం కలిగించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి అనేక మంది పేద, మధ్య తరగతి బాధిత కుటుంబాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి గారు తీసుకున్న నిర్ణయం ప్రజలకు క్యాన్సర్‌పై భయాన్ని పోగొడుతుందని, క్యాన్సర్‌ను తట్టుకోగలిగే మనో ధైర్యాన్ని ఇస్తుందని నమ్ముతున్నా. మరొక్కసారి సీఎం రేవంత్‌రెడ్డి గారికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా

## చందానగర్ నందు ముకుంద జ్యువెలర్స్ నూతన బ్రాంచ్ గొప్ప ప్రారంభం



చందానగర్ నందు మొట్టమొదటి జ్యువలరీ ఫ్యాక్టరీ ఔట్లెట్ నూతన బ్రాంచ్ ముకుంద జ్యువెలర్స్ ప్రారంభించారు 19 ఏప్రిల్ శనివారం ఉదయం 11. 00 గంటలకు, చందానగర్ , MAG-DREAMS (Commercial), Sy. No. 315/2, 4th Floor, Chanda Nagar Village, Serilingampally Mandal, Beside KLM Mall, Telangana-500019 నందు ఆరికెపూడి గాంధీ MLA (Serilingampally), బొగ్గారపు దయానంద్ MLC, మరియు Smt. Manjula, Raghunath Reddy గారు GHMC Corporator, Chandanagar ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ KPHB, ఖమ్మం, కొత్తపేట, సోమాజిగూడ, హనుమకొండ, మరియు సుచిత్ర నందు తమ బ్రాంచిలను ప్రారంభించామని మేము ఊహించిన దానికంటే ఎక్కువ సక్సెస్ కావడంతో నేడు చందానగర్ లో తమ ఇంకో నూతన బ్రాంచ్ ను ప్రారంభించడం జరిగిందని సంస్థ MDనరసింహ రెడ్డి గారు తెలిపారు మరియు మమ్మల్ని ప్రోత్సహిస్తున్న కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మరెన్నో బ్రాంచ్లను ప్రారంభిస్తామని తెలిపారు. PH: 040–28999999.



## చలో వరంగల్, బిఆర్ఎస్ సత్తా చాటుదాం.

### రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలి వెళ్లాలి. కోనరావుపేట మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలకు చల్మెడ పిలుపు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** వరంగల్ సభలో మన బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుదామని, ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగే బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని అన్ని గ్రామాల నుండి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని వేములవాడ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహ రావు పిలుపునిచ్చారు. సోమవారం రోజున కోనరావుపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో మన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రసంగించనున్నారని, కావున ఈ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా రావాలన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ స్థాపించి 24 సంవత్సరాలు గడిచి, 25 వ సంవత్సరం లోకి అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ రజతోత్సవ వేడుకలను ఘనంగా జరుపు కోవాలన్నారు. గ్రామ గ్రామాన ఈనెల 27వ తేదీన బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి కార్యకర్తలు వరంగల్ సభకు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నాయకులతో కలిసి బహిరంగ సభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కొనరావుపేట మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**విత్తన పండుగ డిక్లరేషన్ ను తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు కు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రతినిధులు దొంతి నరసింహారెడ్డి.. లక్ష్మారెడ్డి.. ఆర్ దిలీప్ రెడ్డి అందజేస్తున్న చిత్రం..

## తీన్మార్ మల్లన్న ఖబడ్దార్

### మెట్టు సాయి



సిఎం రేవంత్ రెడ్డి పై తీన్మార్ మల్లన్న మరోసారి నోరు జారితే సహించేది లేదు

నీకు దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చెయ్ తీన్మార్ మల్లన్న

తెలంగాణ రాజకీయ వ్యభిచారి ఎవరైనా ఉన్నారంటే అది చీటర్ తీన్మార్ మల్లన్న

తెలంగాణ రాజకీయ బ్రోకర్ ఎవరైనా ఉన్నారంటే అది తీన్మార్ మల్లన్న

నేను రాజీనామా చేస్తా ఇద్దరం కలిసి పోటీ చేద్దాం

తెలంగాణ రాష్ట్రాన్ని బీసీల నాయకత్వం పెంపొందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు

ఎన్ని సార్లు సీఎం రేవంత్ రెడ్డి కాళ్ళు మొక్కావో గుర్తులేదా

అధిష్టానం రాష్ట్ర రాజకీయ నాయకులను ఒప్పించి సీఎం రేవంత్ రెడ్డి గారు నీకు ఎమ్మెల్సీ టికెట్ ఇప్పించారు

తల్లి పాలు తాగి రొమ్మును తన్నడానికి సిగ్గులేదా

మొగిడివి అయితే స్పీకర్ ఫార్మాట్ లో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి నీ దమ్ము ఏంటో నిరూపించుకో

ఎన్ని పార్టీలు మారావో గుర్తుందా

బీసీల ముసుగులో చిల్లర పనులు చేస్తూ బిసిలను ఇబ్బందులకు గురి చేయడానికి సిగ్గుండాలి

నీది నా కంటే దిగువ స్థాయి.. సీఎం రేవంత్ రెడ్డి గారితో పోల్చుకునే స్థాయి నీకు లేదు

ఇప్పటికైనా నీ స్థాయి కి తగ్గట్టు మాట్లాడటం నేర్చుకో

బండి సంజయ్ కో.. లక్ష్మణ్..అరవింద్ కో గులాం గిరీ చేసుకో

బీజేపీ , బిఆర్ఎస్ ఇచ్చే బిస్కెట్లు తిని బతుకు

ఉదయం బీజేపీ, సాయంత్రం బిఆర్ఎస్ భజన చేసుకో

## ఆకస్మిక తనిఖీ లు



**ప్రజాబలం ప్రతినిధి ములుగు జిల్లాతేదీ 21.04. 2025** అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న హెూటల్ మరియు చికెన్ సెంటర్ యజమానులపై ఆకస్మిక తనిఖీ చేసి కేసులు నమోదు చేసిన సివిల్ సప్లై అధికారులు

సోమవారం రోజున పస్రా మరియు గోవిందరావుపేట్ గ్రామము, గోవిందరావుపేట్ మండలం లో ఉన్నవివిధ హెూటల్లు, గ్యాస్ రిఫిల్లింగ్ చేసే షాపులు, చికెన్ సెంటర్స్, టీ స్టాల్స్ మరియు కిరాణా షాప్ షాపుల్లలో అక్రమంగా నిలువ చేసి మరియు వాడుతున్నవారి పై సివిల్ సప్లై జిల్లా అధికారి ఫైసల్ హుస్సేన్ గారు మరియు డిప్యూటీ తాసిల్దార్ పౌర సరఫరా ములుగు మరియు ఏటూరు నాగారం గార్లు సంయుక్తంగా తనిఖీ చేసి (48) డోమెస్టిక్ సిలిండర్ లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ రెగ్యులేషన్ ఆఫ్ సప్లై అండ్ డిస్ట్రిబ్యూషన్ కంట్రోల్ ఆర్డర్ఆర్డర్ 2000 ప్రకారం స్వాదినపర్చుకున్నారు మరియు అట్టి షాప్ యజమానుల పై కేసు నమోదు చేసినారు. తదుపరి డొమెస్టిక్ సిలిండర్ వాడుతున్న హెూటల్, చికెన్ సెంటర్ యజమానులకి డొమెస్టిక్ సిలండర్ వాడవద్దని కమర్షియల్ సిలిండర్ మాత్రమే వాడాలని సూచించారు.



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**సోమవారంనాడు ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేందర్ మోది చేతుల మీదుగా అవార్డ్ అందుకున్న అదిలాబాద్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com